# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :17 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: బుధవారం 12-03-2025 | పేజీలు:4 వెల: 2.00


## మద్యం కుంభకోణం.. మాజీ సీఎం కుమారుడికి ఈడీ సమన్లు

ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత భూపేశ్ బఘేల్ కుమారుడు చైతన్య బఘేల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు సమన్లు జారీ చేశారు. చైతన్య బఘేల్ మద్యం కుంభకోణంలో మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. దీంతో సోమవారం ఆయన నివాసంలో ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఇవాళ ఆయనకు సమన్లు పంపారు. మార్చి 15న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారుల ముందు విచారణకు హాజరు కావాలని అందులో పేర్కొన్నారు.మద్యం కుంభకోణంలో మనీలాండరింగ్‌కు సంబంధించిన ఆరోపణలు రావడంతో ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు. భిలాయ్‌లోని ఆయన నివాసంతోపాటు చైతన్య స్నేహితులు, కుటుంబ సభ్యులు ఇలా రాష్ట్రంలోని 14 ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో రూ.30 లక్షల నగదు, పలు పత్రాలు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లు స్వాధీనం చేసుకున్నారు. కాగా, మద్యం కుంభకోణం ద్వారా రాష్ట్ర ఖజానాకు భారీగా నష్టం పాటిల్లిందని, మద్యం సిండికేట్‌కు రూ.21 వేల కోట్లకు పైగా లాభం చేకూరిందని

## ఎట్లుండె తెలంగాణ.. ఎట్లాయె తెలంగాణ..! కేటీఆర్ ఆవేదన



హైదరాబాద్ : కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఆగమైపోతున్నది.. సాగుకు సరిపడా నీళ్లు లేక, విద్యుత్ కోతలతో అన్నదాత బోరున విలపిస్తున్నాడు. చేతికొచ్చిన పంటలు ఎండిపోతుంటే రైతన్న తల్లడిల్లిపోతున్నాడు. ఏం చేయాలో దిక్కుతోచక కొందరు అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటుంటే.. మరికొందరు కాంగ్రెస్ ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తున్నారు. అన్నదాతల సమస్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.కేసీఆర్ పాలనలో నడి ఎండకాలంలోనూ చెరువులు మత్తల్లు దుంకాయని కేటీఆర్ గుర్తు చేశారు. నేడు అదే చెరువులు నీళ్లు లేక వెలవెలబోతున్నాయని మండిపడ్డారు. నాడు కాలువల నిండా నీళ్లతో ఏడాదికి రెండు పంటలు పండించుకునేందుకు కేసీఆర్ అండగా నిలిస్తే.. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టులను పడావుబెట్టి, నీళ్లను ఆంధ్రాకు వదిలి పంటలను ఎండబెడుతుందని ధ్వజమెత్తారు.బీఆర్ఎస్ హయాంలో సమయానికి రైతుబంధు, 24 గంటల ఉచిత కరంటు, సాగునీళ్లు, విత్తనాలు, ఎరువులు, పంటల కొనుగోళ్లతో రైతు కంటినిండా నిద్ర, కడుపు నిండా సంతోషంగా ఉన్నాడని కేటీఆర్ గుర్తు చేశారు. 15 నెలల కాంగ్రెస్ పాలనలో రైతుభరోసా రాదు, సాగునీళ్లు ఇవ్వరు, కరంటు ఇవ్వరు, విత్తనాలు దొరకవు, ఎరువులు ఉండవు, అన్ని గండాలు దాటుకుని పంటలు పండిస్తే కొనుగోళ్లు ఉండవు అని కేటీఆర్ పేర్కొన్నారు.కేసీఆర్ పాలనలో వ్యవసాయ అనుకూల విధానాలతో పండగలా వ్యవసాయం ఉండే అని కేటీఆర్ గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో అన్నదాతపై కక్షగట్టి వ్యవసాయాన్ని ఆగంపట్టించారని మండిపడ్డారు. అలంపూర్ నుండి ఆదిలాబాద్ వరకు అశ్వారావుపేట నుండి జహీరాబాద్ వరకు వ్యవసాయం తిరోగమనంలో ఉందన్నారు. సాగునీళ్లు లేక పంటలు ఎండిపోతున్నయ్.. రైతుల గుండెలు మండిపోతున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ వచ్చింది.. కరువును తెచ్చింది. ఎట్లుండె తెలంగాణ.. ఎట్లాయె తెలంగాణ! అని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.

## మురుమూరులో మట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి

పెద్దపల్లి: పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలంలోని మురుమూరు నుంచి మట్టి అక్రమ రవాణాను అడ్డుకోవాలని బీఆర్ఎస్ నేత, కార్మిక నాయకుడు కౌశిక్ హరి డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా కోట్లాది రూపాయల విలువైన మట్టి అక్రమంగా అక్రమంగా తరలివెళ్తున్నదని, దానిని ప్రభుత్వం నిలువరించాలన్నారు. ఈమేరకు పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్‌లో ఏవో శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. గతేడాది మురుమూరు నుంచి అనుమతులు తీసుకొని మట్టి రవాణా చేశారని, పరిమితికి మించి మట్టి వెలికితీయడంతో పాటు మట్టిని రోలర్లతో తొక్కించి చదును చేశారన్నారు. 1,50,000లకు పైగా మెట్రిక్ టన్నుల మట్టి అక్కడ నిల్వ ఉండగా కేవలం 80 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే ఉన్నట్లుగా చూపించారని ఆరోపించారు. జరిమానా విషయంలో సాధారణంగా డబ్బులు కట్టించుకున్నారే తప్ప పూర్తిగా ఫైన్‌ను వసూలు చేయలేదని చెప్పారు. అసలే ప్రభుత్వం లోటు బడ్జెట్‌తో సతమతమవుతుంటే.. కోట్ల రూపాయల విలువైన మట్టిని కొల్లగొడుతున్నా అధికారులు అనుమతులివ్వడం విమర్శలకు తావిస్తుందన్నారు. కొందరు ప్రజా ప్రతినిధుల ఒత్తిడులకు తలొగ్గి అనుమతులు ఇచ్చారని, భారీగా డబ్బులు చేతులు మారాయన్నారు. నిర్ణీత మట్టి కంటే అత్యధికంగా తోడిన వారికి అనుమతులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఈ విషయంలో రాష్ట్రస్థాయి అధికారులు చొరవ చూపి పూర్తిస్థాయి విచారణ జరపాలని, బాధ్యులపై చర్యలు



తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమంగా తరలి వెళ్తున్న మట్టిని వెంటనే నిలిపివేసి మట్టి నిల్వలకు వేలం నిర్వహించాలన్నారు. కౌశిక్ హరి వెంట మద్దికుంట శంకర్, నిమ్మరాజుల రవి, కుక్క గంగప్రసాద్, తమ్మనవేని మహేష్, ముత్యం లక్ష్మణ్, వంశీ, రవితేజ, పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజు కుమార్, దాసరి సతీష్, మాదాసి శ్రీనివాసు, బత్తిని సతీష్, చంద్రమోహన్ కుర్ర, రమేష్ కాంపెల్లి, సుధాకర్ గాలేంకి, ప్రసాద్ వొల్లపు, మల్లేష్ దొబ్బెల్, తిరుపతి గోనే, రాజయ్య, శంకర్ నాయక్, మాటేటి నరేష్ ఉన్నారు.

## మూడేళ్లలోఅమరావతి నిర్మాణాలు పూర్తి చేస్తాం...

అమరావతి,మూడు సంవత్సరాలలో అమరావతి నిర్మాణం పూర్తి చేస్తామని మంత్రి నారాయణ అసెంబ్లీలో ప్రకటించారు. ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో ప్రశ్నోత్తరాలలో రాజధాని అమరావతి విషయంలో సభ్యులు సుజనా చౌదరి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. అమరావతి పనుల పూర్తికి 64వేల 721 కోట్లతో ఎస్టిమేషన్ వేశామని.. టెండర్లు కొనసాగుతున్నాయని చెప్పారు. 2019–24లో వచ్చిన రాజకీయ అనిశ్చితి వల్ల అమరావతి నిర్మాణంలో ఇబ్బందులు వచ్చాయని చెప్పుకొచ్చారు. 2028కి రైతులకు ఇవ్వాల్సిన లే అవుట్‌లు వేసి ఇస్తామని తెలిపారు.అమరావతి రాజధానిని 2014–19న నిర్ణయించినప్పుడు ఇదే సభలో వైఎస్ జగన్ ఆమోదం తెలిపారని%ా% ప్రభుత్వం మారాక మూడుముక్కలాడారని మండిపడ్డారు నారాయణ. రాజధాని రైతులు ఎంతో ఇబ్బందులు పడ్డారని తెలిపారు. 58 రోజుల్లో ఒక్క లిటిగేషన్ లేకుండా భూములు ఇచ్చారని.. ఈ ఏడు, ఎనిమిది నెలలు హర్డిల్స్ అన్నీ దాటి టెండర్లను పిలిచామని చెప్పారు. వరల్డ్ బ్యాంకు, ఏడీబీ 13400 కోట్లు మంజూరు చేసిందని, కెఎఫ్‌డబ్ల్యూ బ్యాంకు రూ.5 వేల కోట్లు ఇచ్చిందని.. అలాగే హడ్కో రూ.11 వేల కోట్లు ఇస్తోందని తెలిపారు. అంతేకాకుండా రూ.1560 కోట్లు కేంద్రం గ్రాంటు కింద ఇస్తోందని వెల్లడించారు.

మూడేళ్లలోనే అమరావతి నిర్మాణం

రాజధానిని మూడు సంవత్సరాల్లో కంప్లీట్ చేస్తామని మరోసారి స్పష్టం చేశారు. మెయిర్ రోడ్డులు 2 సంవత్సరాల్లో పూర్తి చేస్తామని.. ఎల్‌పీఎస్ రోడ్లు, డ్రైన్లు మూడు సంవత్సరాల్లో పూర్తి చేస్తామన్నారు. అమరావతి రాజధానికి జగన్ ముందు ఒప్పుకొని తరువాత ప్లేటు ఫిరాయించారని మండిపడ్డారు. దీంతో అయిదేళ్ల పాటు రైతులు సఫర్ అయ్యారన్నారు. అసెంబ్లీ, హైకోర్టు 3 సంవత్సరాల్లో పూర్తవుతాయని వెల్లడించారు. 136 ఆర్గనైజేషన్లుకు 1277



ఎకరాలు ఇచ్చామని.. గత అయిదేళ్ల పరిణామాల వల్ల కొందరు వెనెక్కి వెళ్లారని తెలిపారు. 31 ఆర్గనైజేషన్‌లకు 629.3 ఎకరాలకు అంగీకారం తెలిపామన్నారు. 13 సంస్థలకు ఇచ్చిన భూములు రద్దు చేశామన్నారు. ట్రంక్ ఇన్ఫ్రాస్ట్రచ్చర్, రోడ్డు, స్ట్రామ్ వాటర్, వాకింగ్ ట్రాక్స్ వంటి ఫెసిలిటీస్‌తో ఉన్నాయన్నారు. 1280 ఎల్‌పీఎస్ రోడ్లకు టెండర్లు పిలిచామన్నారు. కొండవీటి వాగు, వాగు గ్రావీటీ కెనాల్‌లకు టెండర్లు పిలిచామన్నారు. మొత్తం 73 వర్కులకు రూ.64,721 కోట్లు ఎస్టిమేషన్ వేశామని%ా% వీటిలో 62 పనులను టెండర్లు అయిపోయాయని చెప్పారు. గత ముఖ్యమంత్రి 50 వేల మందికి సెంటు లెక్కన ఇచ్చారన్నారు. ఆర్‌ఫైవ్ జోన్ క్రియేట్ చేశారని%ా% వారికి ఆల్టర్నేట్ స్థలం ఇచ్చి ఆ భూమిని కూడా తీసుకుంటామని మంత్రి నారాయణ సభలో పేర్కొన్నారు.

## ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం



మహబూబ్ నగర్ : ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఇవాళ మహబూబ్ నగర్ నియోజకవర్గంలోని ధర్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముడా నిధులతో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పదవ తరగతి వార్షిక పరీక్షలకు సన్నద్ధమౌతున్న విద్యార్థులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

అందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ధర్మాపూర్ గ్రామంలో 40 లక్షల రూపాయలతో ఎస్సీ సబ్ ప్లాన్ కింద మంజూరైన సీసీ రోడ్లు , అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో అన్ని విధాలా అభివృద్ధి చేసి చూపిస్తున్నామని ఆయన తెలిపా రు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, సుధాకర్ రెడ్డి, రామచంద్రయ్య, శ్రీనివాస్ యాదవ్, గోవింద్ యాదవ్, ధర్మాపూర్ నర్సింహారెడ్డి, మల్లు అనిల్ కుమార్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## పసుపు రైతులు అల్లాడుతుంటే.. రేవంత్ సర్కార్ ఏం చేస్తోంది?

హైదరాబాద్: పసుపు రైతుల ఆందోళనపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పందించారు. పసుపు రైతుల ఆందోళనలు రాష్ట్ర ప్రభుత్వానికి కనిపించడం లేదా? అంటూ ప్రశ్నించారు. గిట్టుబాటు ధర రాక పసుపు రైతులు అల్లాడుతుంటే ప్రభుత్వం ఏం చేస్తోందంటూ నిలదీశారు. మాటలు చెప్పిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోవడానికి ముందుకు రావడం లేదు. క్వింటాలు పసుపుకు 15 వేల ధర కల్పిస్తామని ఎన్నికల సమయంలో రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. కానీ ఇప్పుడు పసుపునకు కనీసం 9 వేలు రాని పరిస్థితి ఉంది. అయినా కూడా రాష్ట్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించడానికి చర్యలు తీసుకోకపోవడం దారుణమని కవిత ధ్వజమెత్తారు.“ఇది రైతులను నయవంచన చేయడమే, మోసం చేయడమే. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం రూ.15 వేల మద్దతు ధర చెల్లిస్తూ పసుపు పంటను కొనుగోలు చేయాలి. పసుపు బోర్డు తీసుకొచ్చామని చెబుతున్న బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ కనీసం రైతులను పరామర్శించడం లేదు. పసుపు బోర్డుకు చట్టబద్ధత లేకపోవడంతో రైతులకు ప్రయోజనాలు కలగడం లేదు. పసుపుకు ధరలు పెంచుతామని, మరిన్ని



ప్రయోజనాలు కల్పిస్తామని పసుపు బోర్డు ప్రారంభోత్సవంలో బండి సంజయ్ చెప్పారు. కానీ ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నట్లు కనిపించడం లేదు. కేంద్ర ప్రభుత్వం కూడా ముందుకు వచ్చి పసుపు రైతులను ఆదుకోవాలి” అని కవిత డిమాండ చేశారు.

## తెలంగాణ ప్రభుత్వంతో చర్చలు.. ప్రాచీన పత్రాలు రప్పిస్తాం..!



విజయవాడ:ఆర్కియాలజీ లైబ్రరీల గురించి అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమాయంలో చర్చ సాగింది.. రాష్ట్ర విభజన జరిగినప్పుడు.. ఆస్తి, అప్పుల విభజనలో ఏపీకి ఆర్కియాలజీ లైబ్రరీకి సంబంధించి సాంస్కృతిక సంపద పూర్తిగా రాలేదని లేవనెత్తారు జనసేన ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్..ప్రభుత్వం వెంటనే ఆర్కియాలజీ శాఖ లైబ్రరీపై దృష్టి పెట్టాలని కోరారు.. ఇక, మండలి బుద్ధ ప్రసాద్ అడిగిన ప్రశ్నకు మంత్రి నారా లోకేష్ సమాధానం ఇస్తూ.. రాష్ట్ర విభజన తర్వాత 50 శాతం ప్రాచీన పత్రాలు రాష్ట్రానికి బదిలీచేశారని, మిగిలినవాటిని రప్పించేందుకు తెలంగాణ ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.రాష్ట్ర ప్రాచీనపత్ర భాండాగారం నుంచి అధికారిక పత్రాలు, శాసనాలు, రికార్డులు రాష్ట్రానికి రప్పించే అంశంపై శాసనసభలో మంత్రి అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రశ్నించారు.. తెలుగుజాతి చరిత్ర పరిరక్షణకు ఆర్కీవ్స్, ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్ లైబ్రరీకి, డిస్ట్రిక్ట్ గెజిట్స్ అనే మూడు సంస్థలు ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు, గురజాడ అప్పారావు వంటి మహనీయులు రాసిన లేఖలు ఆర్కీవ్స్ ఉన్నాయన్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఈ అంశాన్ని షెడ్యూలు 10లో చేర్చారు. జాతి సంపదను కాపాడాకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. దీనిపై మంత్రి నారా లోకేష్ స్పందిస్తూ.. లైబ్రరీస్ పై మూడు సార్లు రివ్యూ చేశాం అన్నారు.., ఆర్కీవ్స్ పై వెనుకబడి ఉన్నామని.. ఇది చాలా సీరియస్ గా తీసుకోవాల్సిన అంశం అన్నారు.. 10వ షెడ్యూలులో ఈ సంస్థ ఉందన్నారు.. మొత్తం 15 కేటగిరిల రికార్డులకుగాను 7 కేటగిరిలు ఇచ్చారు. రెండు కాపీలు ఉన్నవి. ఒకటి మనకు ఇచ్చా, ఒకే ఒక కాపీ ఉన్నవాటిపై చర్చించాల్సి ఉంది. డిజిటలైజ్ చేసి వాటి పరిరక్షణకు చర్యలు చేపట్టే అంశాన్ని పరిశీలిస్తాం. బడ్జెట్ లో నిధులు కేటాయించాలని కోరాం, అవసరమైతే సీఎస్ఆర్ నిధులు తెచ్చి పూర్వవైభవం తెచ్చేందుకు కృషిచేస్తాం. పెద్దఎత్తున డిజిటలైజేషన్ చేపట్టాల్సి ఉంది. 24,347 చదరవు అడుగుల అద్దె భవనంలో ప్రస్తుతం ఆర్కీవ్స్ విభాగం పనిచేస్తోంది, అక్కడే రికార్డులన్నీ నిర్వహిస్తున్నాం. రాష్ట్రవిభజన తర్వాత మనకు సెంట్రల్ లైబ్రరీ లేనందున అమరావతిలో భూమి కేటాయించాలని ముఖ్యమంత్రిని కోరాం. అక్కడే ఆర్కీవ్స్ పరిరరక్షణపై దృష్టి పెడతాం. ఆర్కీవ్స్ పై శాసనసభ్యులతో కమిటీ ఏర్పాటుచేస్తాం. టెక్నాలజీ జోడించి, ఆర్కీవ్స్ పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం అన్నారు..ఇక, కేంద్రప్రభుత్వ నిధులు రాబట్టే అంశాన్ని పరిశీలిస్తాం. డిజిటలైజేషన్ పై ఫోకస్ పెట్టాల్సిన అవసరం ఉందన్నారు మంత్రి లోకేష్.. ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్ లైబ్రరీ నుంచి రికార్డులను రప్పించే కార్యక్రమాన్ని ఈ ఏడాది పూర్తిచేస్తాం. డిస్ట్రిక్ట్ గెజిట్స్ మంగళగిరికి వచ్చాయని సమాచారం ఉంది, పెండింగ్ ఉన్న వాటిని రప్పించేందుకు చర్యలు చేపడతాం. పాదయాత్ర సమయంలో గ్రంథాలయాల అవసరం తెలుసుకున్నా. వివిధ అంశాలపై చర్చించడానికి లైబ్రరీ వేదిక ఉంటుందని తెలుసుకున్నా. అధికారుల కొరత ఉంది. గ్రామ, నియోజకవర్గ, జిల్లా, ప్రాంతీయ, సెంట్రల్ లైబ్రరీలు ఎలా ఉండాలనే విషయమై చర్చిస్తున్నాం. నేషనల్ ఆర్కియాలజీ అధ్యయనం చేసి, వచ్చే సంవత్సరం గ్రంథాలయాల ఆధునీకరణ కార్యక్రమాన్ని చేపడతామని మంత్రి నారా లోకేష్ చెప్పారు. రాజమండ్రి ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ%ా% భాషా, సంస్కృతిని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది, గౌతమి లైబ్రరీ కాపాడటానికి 13 ఏళ్లు పట్టింది. వీటి పరిరక్షణకు బడ్జెట్ తక్కువగా ఉంది. గతంలో రాజారామ్మోహన్ రాయ్ ఫౌండేషన్ నిధులిచ్చేవారు. లైబ్రరీల్లో విలువైన పుస్తకాలు కొనుగోలు చేయాలని కోరారు.

### ఇంటర్నేషనల్ డ్రగ్ డీలర్ షెహనాజ్ సింగ్ అరెస్ట్

చండీఘఢ్,అమెరికా సహా పలు దేశాలకు మాదక ద్రవ్యాలను సరఫరా చేస్తున్న అంతర్జాతీయ డ్రగ్ డీలర్‌ను పంజాబ్ పోలీసులు పట్టుకున్నారు. ఎఫ్‌బీఐ మోస్ట్‌వాంటెడ్ జాబితాలో ఉన్న ఇంటర్నేషనల్ డ్రగ్ లార్డ్ షెహనాజ్ సింగ్ అలియాస్ షాన్ భిందెర్‌ను అరెస్టు చేసినట్లు పంజాబ్ డీజీపీ సామాజిక మాధ్యమాల్లో ప్రకటించారు. నార్కోటిక్స్ సిండికేట్‌లో అతడు కీలకంగా వ్యవహరిస్తున్నాడని, కొలంబియా నుంచి అమెరికా, కెనడాలోకి మాదకద్రవ్యాలను స్మగ్లింగ్ చేస్తున్నట్లు గుర్తించామని తెలిపారు.

## ‘అప్పా’ ఇమేజ్ కోసం తపిస్తున్న స్టాలిన్...



తమిళనాడు: రాజకీయాల్లోకి వచ్చే వారిని గమనిస్తే చాలా ఆసక్తికర అంశాలు కనిపిస్తాయి. తొలుత గుర్తింపు కోసం తహతహ కనిపిస్తుంది. ఆ దశను విజయవంతంగా దాటితే.. హోదా కోసం తపించటం మొదలవుతుంది. ఆ దశను సక్సెస్ ఫుల్ గా రీచ్ అయితే.. ఆ తర్వాత తమ పేరును బ్రాండ్ గా మా ర్చుకోవాలన్న ఆలోచనలు ఎక్కువ అవుతాయి. అది కూడా పూర్తి అయితే.. ప్రజలతో భావోద్వేగ బంధానికి ప్రయత్నించటం.. అందుకోసం ప్రజల కుటుంబా ల్లో తాను ఒకడిగా మారాలన్న ఆసక్తి ఎక్కువ అవుతుంది.ఎన్టీఆర్ ను అన్నా.. జయలలితను అమ్మా.. కేసీఆర్ ను బాపూ.. ఇలా చెప్పుకుంటూ పోతే చాలామంది అధినేతలకు ఉండే లక్షణమే.. ఇప్పుడు తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కోరుకుంటున్నారు. తమిళనాడు రాజకీయాల్లో ఎంతోమంది అధినేతలు ఉన్నప్పటికి.. జయలలితకు ఉండే ఇమేజ్ కాస్త భిన్నమైనదిగా చెప్పాలి. తమిళనాడులోని రాజకీయ అధినేతల్ని చూసినప్పుడు వారి పేరు ముందు బిరుదులు కనిపిస్తాయి. పెరియార్ ను ‘తంద్రై’ అని.. అన్నాదురైను ‘పేరరిజ్ఞర్’ అని.. ఎంజీఆర్ ను ‘పురట్చి తలైవర్’ అని.. కరుణానిధిని ‘కలైజ్ఞర్’ అని.. జయలలితను ‘పురట్చి తలైవి’ అని పిలుచుకోవటం కనిపిస్తుంది అయితే.. మిగిలిన వారికి భిన్నంగా జయలలితను పురట్చితలైవి (విప్లవ నాయికి) అన్న బిరుదుతో పాటు.. ‘అమ్మ’ అంటూ నోరారా పిలుచుకున్నేలా చేసుకున్నారు. తమిళనాడు లాంటి రాష్ట్రంలో ‘అమ్మ’ ఇమేజ్ ను సొంతం చేసుకోవటం అంత తేలిక కాదు.. అందులోనూ పురుషాధిక్యత ఎక్కువగా ఉండే ఆ సమాజంలో.. పురుషాధిక్యతను సవాలు చేసి మరీ సక్సెస్ అయిన అరుదైన అధినేత్రిగా జయలలితను చెప్పాలి.జయలలిత తర్వాత ఇప్పుడు ఆమెకు మాత్రమే సొంతమైన ఇమేజ్ ను సొంతం చేసుకోవాలన్నదే ముఖ్యమంత్రి స్టాలిన్ లక్ష్యంగా కనిపిస్తోంది. ఇందుకోసం ఆయన పెద్ద ఎత్తున ప్రయత్నాలు చేస్తున్నారు. తమ పేరుకు ముందు ఉండే బిరుదు కంటే కూడా అందరి చేత అప్పా ‘నాన్న’ గా పిలుచుకోవాలని తపిస్తున్నారు స్టాలిన్. అందుకు తనకు తానే.. తనను అందరూ అప్పా అని పిలుస్తున్నట్లుగా పలు వేదికల మీద చెప్పుకోవటం కనిపిస్తుంది.అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం మీద మాట్లాడిన సీఎం స్టాలిన్.. విద్యార్థులు తనను అప్పా.. అప్పా అని పిలుస్తుంటే తనకు చెప్పలేనంత ఆనందం కలుగుతోందని చెప్పటం ద్వారా.. అందరూ తనను అప్పా అన్న మాటను పిలవాలని కోరుకుంటున్న విషయం అర్థమవుతుంది. తన ఇమేజ్ ను మరింత పెంచుకునేందుకు వీలుగా స్టాలిన్ ప్లాన్ చేసినట్లుగా చెబుతున్నారు. ఈ ఏడాది బడ్జెట్ లో అప్పా పేరుతో మరిన్ని సంక్షేమ కార్యక్రమాల్ని ప్రకటించాలన్న ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.అమ్మ క్యాంటిన్.. అమ్మా ఉప్పు.. అమ్మా మినీ క్లినిక్.. అమ్మా కుడినీర్.. అమ్మా స్కూటర్.. అమ్మా ల్యాప్ టాప్ లాంటి పథకాలతో జయలలిత పేరును మరిచిపోయి అమ్మగా తమిళ ప్రజలకు ఎంతలా దగ్గరయ్యారో తెలిసిందే.

## సంపాదకీయం

**బుధవారం 12-03-2025**

# దయ్యాల వేద పఠనం!

తెర వెనుక కత్తుల కోలాటమాడుతున్నవారు తెరముందుకొచ్చి శాంతి కపోతాలను వదులుతున్నారు. రోత చేష్టల రంగమార్తాండులు శ్రీరంగనీతులు బోధిస్తున్నారు. అదిగో దొంగ ఇదిగోదొంగ అంటూ గజదొంగలే అరుస్తున్నారు. ఇప్పుడు ఆంధ్ర ప్రదేశ్‌లో కంచె చేను మేస్తున్నది. పోలీసు వ్యవస్థను ప్రతిపక్షంపైకి పాలకులు ఉసిగొల్పుతున్నారు. ఇదే కదా, అసలు సిసలైన వ్యవస్థీకృత నేరం. అత్యున్నత స్థాయి పోలీసు అధికారి మంత్రి వర్గం ముందు హాజరై ఓ గొప్ప వాగ్దానం చేశాడని వార్తలు వెలువడ్డాయి. ప్రతిపక్షాన్నీ, దాని అభిమానులనూ వేటాడే పనిలో మరింత వేగం పెంచుతారట. దీన్నేమంటాము? నేరమే అధికారమై కొలువు దీరడం కాదా? నేరమే అధికారమై కొరడా ఝుళిపించడం కాదా? నేరమే అధికారమై ప్రజల్నే నేరస్థుల్ని చేస్తుంటే నోరుండీ ఊరక కూర్చున్న ప్రతి ఒక్కడూ నేరస్థుడేనంటారు విప్లవకవి వరవరరావు. ఈరోజు వేటాడుతున్నది ప్రతిపక్షాన్నే కావచ్చు. రక్తం రుచి మరిగిన పులికి పరిమితులూ, షరతులూ వర్తి స్తాయా? ఉపవాస దీక్షలేమైనా అడ్డొస్తాయా? పౌరహక్కులను పాదాల కింద తొక్కేయడానికి అలవాటుపడ్డ పోలీస్ రాజ్యం కూడా అంతే! ఈ రోజున వాడు తడుతున్నది నీ ఇంటి తలుపును కాకపోవచ్చు. నేడు కాకపోతే రేపు లేదా మరునాడు... నువ్వు నీ హక్కుల్ని గురించి ప్రశ్నించిన రోజున నీ ఇంటి ముంగిట కూడా ఆ బూట్ల చప్పుడు వినిపిస్తుంది.నేరమే అధికారమై ప్రశ్నిస్తున్న ప్రతివాడి మీద నేరస్థుడనే ముద్ర వేసే ధోరణిని ఆదిలోనే ప్రతిఘటించకపోతే ప్రజాస్వామ్య మనుగడకే ప్రమాదమేర్పడుతుంది. అధికారంలోకి రావడానికి అసత్యాలకూ, అభూత కల్పనలకూ ఒడిగట్టారు గనుక ప్రభుత్వపక్ష స్వభావాన్ని నేరపూరితమైనదిగా భావించ వలసి వస్తున్నది. అసత్యాలూ, అభూత కల్పనలన్నీ ఒక్కొక్కటిగా రుజువౌతూ వస్తున్నాయి గనుక నేరమే అధికారం రూపు దాల్చిందని అనుకోవలసి వస్తున్నది. గతకాలపు జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేసిందనీ, 14 లక్షల కోట్ల అప్పు చేశారనీ కూటమి పక్షం ఊరూవాడా ఏకంచేసి ప్రచారం చేసింది. మొన్ననే రాష్ట్ర శాసనసభలో సాక్షాత్తూ ఆర్థికమంత్రి పాత ప్రచారానికి విరుద్ధమైన ప్రకటన చేశారు. జగన్ ప్రభుత్వం చేసిన మొత్తం అప్పు 3 లక్షల 39 వేల కోట్లేనని తేల్చారు. ఎంత గుండెలు తీసిన బంట్లు వీరు? ఈ ఒక్క ఉదాహరణ చాలదా, ప్రభుత్వ నేరపూరిత స్వభావాన్ని నిర్ధారణ చేయడానికి?అప్పుల ప్రస్తావన మచ్చుకు మాత్రమే. ఇటువంటి బేషరమ్ ప్రచారాలు చాలా చేసింది కూటమి. సామాన్య ప్రజల ఆశల మీద, ఆకాంక్షల మీద కూటమి జూదమాడింది. వారి కలల అలల మీద ఆటలాడింది. ఏమార్చడానికి ఇచ్చిన ఎన్నికల మేనిఫెస్టోను డస్ట్‌బిన్‌లోకి గిరాటేసింది. కుర్చీ మీద కూర్చొని నవమాసాలు గడిచిపోయాయి. హామీల డెలివరీ ఆనవాళ్లే లేవు. ఉండకపోవచ్చు కూడా. బడ్జెట్‌లో కొన్ని హామీలకు మాత్రమే అరకొర కేటాయింపులు చూపారు. మిగతా వాటి ఊసే లేదు. నిరుద్యోగులకు నెలకు 3 వేల భృతి ఇస్తామన్నారు. మోసం చేశారు. ఆడబిడ్డలకు నెలకు పదిహేను వేలిస్తామన్నారు. మోసం చేశారు. స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికీ ఏటా 15 వేలిస్తా మన్నారు. దానికి ఒక ఏడాది ఎగనామం పెట్టి, ఈసారి బడ్జెట్‌లో అవసరమైన సొమ్ములో సగం మాత్రమే కేటాయించారు.ఇంతవరకూ ఒక్క పైసా కూడా లబ్ధిదారులకు చేరలేదు.రైతుకు ఏటా 20 వేల ఆర్థిక సాయమన్నారు. రైతన్న ఎదురు చూస్తూనే ఉన్నాడు.సాయం సంగతి దేవుడెరుగు. పండించిన పంటకు గిట్టు బాటు ధర లేక రైతులు అల్లాడుతున్నారు. జగన్ హయాంలో ఇరవై నుంచి ఇరవై ఏడు వేల దాకా పలికిన క్వింటాల్ మిర్చి ధర ఇప్పుడు ఆరేడు నుంచి పదివేల దాకా పడిపోయింది. పెట్టుబడి ఖర్చులు కూడా రైతులకు రాలేదు. అన్ని పంటల కథలూ దాదాపు ఇంతే! కాల్వల కింద వేసుకున్న వరి పైర్లు కూడా నీటి తడులు లేక ఎండిపోతున్న వైనాన్ని ఐదేళ్ల తర్వాత ఇప్పుడే చూస్తున్నాము. మహిళలకు ఉచిత బస్సు ఇంకా డిపో దాటి రోడ్డెక్కలేదు. అప్పుడే దానిమీద మాట మార్చడం మొదలైంది. ఉచిత బస్సును ఒక్క జిల్లాకే పరిమితం చేస్తామని ఇప్పుడు చెబుతున్నారు.ఈ రకంగా హామీల ఎగవేతతోపాటు పాలనా వైఫల్యాలతో ఆదిలోనే అప్రతిష్ఠ మూటగట్టుకున్న కూటమి సర్కార్ విమర్శ కుల నోళ్లు మూయించి, అసత్యాలను ప్రచారంలో పెట్టి పబ్బం గడుపుకోవాలనే నిర్ణయానికి వచ్చింది. ఇప్పుడు ప్రధాన ప్రతిపక్షమైన వైసీపీపై దాడిని కేంద్రీకరించి, భారత న్యాయసంహితలోని 111వ సెక్షన్‌ను ఈ దాడికి ఆయుధంగా వాడటం మొదలుపెట్టారు. సోషల్ మీడియా వేదికగా విమర్శలు చేసే వారిపై ఈ సెక్షన్ వాడకూడదని ఏపీ హైకోర్టు చెప్పినా కూడా కూటమి సర్కార్ చెవికెక్కించుకోలేదు. కిడ్నాపులు, దోపిడీలు, భూకబ్జాలు, ఉగ్రవాద కార్యకలాపాలు, ఆర్థిక నేరాలు వగైరా ముఠాలుగా ఏర్పడి చేసే నేరాలు (వ్యవస్థీకృత నేరాలు) ఈ సెక్షన్ పరిధిలోకి వస్తాయి.సోషల్ మీడియాలో చేసే విమర్శలను ఈ పరిధిలోకి తెచ్చి రాష్ట్ర సర్కార్ చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్నది. ప్రత్యర్థుల పట్ల కక్షపూరిత వైఖరి కారణంగానే సర్కార్ ఈ కుట్రకు తెరతీసిందనుకోవాలి. సోషల్ మీడియాలో చేసే విమర్శల వెనుక ఎవరిదో ప్రోద్బలం ఉన్నదనీ, ఇదంతా వ్యవస్థీకృతంగా జరుతున్నదనీ ఓ స్క్రీన్‌ప్లేను తయారుచేసి, దానికి అనుగుణంగా కీలక వ్యక్తులను అరెస్ట్ చేయాలనీ, తద్వారా ఆ పార్టీని బలహీన పరచాలనే పన్నాగం స్పష్టంగానే కనిపిస్తున్నది. ఇందు కోసం వేలాదిమంది కార్యకర్తలు, అభిమానుల మీద కేసులు పెట్టాలనీ, వేధించాలనీ జిలాల్ల వారీగా టార్గెట్లు పెట్టుకున్నట్టు వార్తలు వస్తున్నాయి.ఇటీవల పోలీసు ఉన్నతాధికారి నిర్వహించిన ఒక సమీక్షా సమావేశంలో కూడా ఈ టార్గెట్‌లను చేరుకునేలా సహకరించాలనే ఆదేశాలిచ్చినట్టు వచ్చిన వార్తలు నిజమైతే అంతకంటే దౌర్భాగ్యం మరొకటి ఉండదు. గత ప్రభుత్వ హయాంలో కూటమి అగ్రనాయకులంతా బరితెగించి మాట్లాడిన బూతుల ఆడియోలు, చెప్పులు చూపెట్టిన వీడియోలు కోకొల్లలు. వీరికి భిన్నంగా వైసీపీ అధినేత ఏనాడూ ఏ ఒక్క అసభ్యకర వ్యాఖ్యానం చేయలేదు. అయినా సరే, వీరి బూతులకు బదు లిచ్చిన నేతలపై అక్రమ కేసులకు తెగబడుతున్నారు.మొన్నటి మంత్రివర్గ సమావేశం ఎజెండా ముగిసిన తర్వాత ఒక పోలీస్ ఉన్నతాధికారి హాజరై ఒక వింత సందేశాన్ని వినిపించినట్టు యెల్లో మీడియా టాప్ న్యూస్‌గా ప్రచారంచేసింది. బహుశా కూటమి పెద్దల తాజా కుట్రలో భాగంగానే ఈ వింత కథను ప్రచారంలోకి తెచ్చి ఉంటారు. అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఇటీవల చనిపోయిన రంగన్న అనే వివేకానందరెడ్డి ఇంటి వాచ్‌మన్ మరణం అనుమానాస్పదమేనని ఆ ఉన్నతాధికారి మంత్రులకు ఉపదేశించారట! అనారోగ్యంతో ఉన్న తన భర్తను పోలీసులు వేధించారనీ, అందువల్లనే అయన చనిపోయాడనీ రంగన్న భార్య మీడియాతో మాట్లాడిన మాట లను వారెందుకు పరిశీలనలోకి తీసుకోలేదో తెలియదు మరి! అంతటితో ఆగలేదు. ఈమధ్యకాలంలో చనిపోయిన వ్యక్తులను వివేకానంద హత్య కేసుకు లింకు చేస్తూ అవన్నీ అనుమానాస్పద మరణాలేనని చెప్పడానికి పూనుకోవడం, మోకాలుకు, బోడిగుండుకు ముడిపెట్టినట్టు కథలు అల్లడం దిగ్భ్రాంతి కలిగిస్తున్నది. అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయిన అభిషేక్ రెడ్డి మరణంపై కూడా అనుమానాలున్నాయట! జగన్ కుటుంబ సభ్యుల ప్రేమాభిమా నాలు చూరగొన్న డ్రైవర్ నారాయణ కేన్సర్ వ్యాధికి చికిత్స తీసుకుంటూ కొంతకాలం క్రితం చనిపోయాడు. అందులో కూడా అనుమానం ఉన్నదట!

# విపక్షాల సమర్థతకు విషమ పరీక్ష!



న్యూఢిల్లీ,పార్లమెంట్ మలివిడత బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభం అయ్యాయి. దేశంలో ఉన్న సమస్సయల దృష్ట్యా ఈ సమావేశాలే కీలకం. ఈ సమావేశాల్లో ఏ అంశంపై చర్చించాలి..చర్చించకూడదు.. సభాసమయాన్ని సద్వినియోగం చేసుకోవడమెలా అన్నది కూడా విపక్ష కాంగ్రెస్ చతురతపై ఆధారపడి ఉంది. అలాగే విపక్షాలు కూడా సమర్థత ప్రదర్శించాల్సి ఉంది. కేవలం అల్లరి చేసి వాకట్లు చేయడమో. ప్రతిష్టంభనతో సభ వాయిదా వేయించడం వల్లనో సమస్యలు చర్చకు రావు. ఇది గమనించి కాంగ్రెస్ వ్యూహాత్మకంగా వ్యవహరించాల్సి ఉంది. లేకుంటే అది విపక్ష పార్టీగా విఫలం అయినట్లే. ప్రధానంగా డిటిమిటేషన్ భయాలు, జనగణన,జిఎస్టీ, నిరుద్యోగం, ఔషధధరలు, పెరుగుతున్న నిత్యావసర ధరలు వంటి ప్రధాన సమస్యలు దేశాన్ని పట్టిపీడిస్తున్నాయి. ప్రధానంగా ఇప్పుడు డీలిమిటేషన్‌పై సర్వత్రా చర్చ నడుస్తోంది. దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా ప్రాతిపదికన సీట్లు తగ్గుతాయని ఆందోళన వ్యక్తం అవుతోంది. దీనిపై బిజెపి లేదా ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదు. తెలంగాణ బిజెపి నేతలు మాత్రం సీట్లు తగ్గవని అంటున్నారు. ఇంతకీ ఇప్పుడున్న సీట్లు తగ్గవా లేక, పెరిగే సీట్లు తగ్గవా అన్నది స్పష్టం చేయకుండా గోడవాటం పిల్లిలా వ్యవహరిస్తున్నారు. అమెరికా తరహాలోనే భారత్ కూడా ప్రజ్యాస్వామ్య వ్యవస్థ కలిగిన సమాఖ్య రాజ్యం. 1971లోని జనాభా నిష్పత్తి ప్రకారం ప్రాతినిధ్యం కల్పించడం వల్ల ఊహించని ప్రమాదాలు ఎదురవుతాయనే వాస్తవాన్ని గుర్తించాము. అయితే ఒక పరిష్కారాన్ని కనుగొనడానికి బదులు దాన్ని 2026 దాకా వాయిదా వేశాము. చివరి జనాభా గణన 2011లో జరిగింది. తదుపరి జనాభా గణన 2021లో జరగవలసి ఉండగా కోవిడ్ విలయం వల్ల వాయిదా వేశారు. 2021 నుంచి ఏదో ఒక సాకుతో జనాభా గణన జరగనే లేదు. తాజాగా కులగణన అంటూ కాంగ్రెస్ రాజకీయాలు మొదలు పెట్టింది. దీంతో సమాజంలో చీలిక తప్ప మరోటి రాదు. ఇది ఓ రకంగా అచ్చం రాజకీయ లబ్దికోసం చేస్తున్న డిమాండ్ తప్ప మరోటి కాదు. ఈ క్రమంలో 2026లో జనాభా గణన అనంతరం విధిగా లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన జరగవలసి ఉన్నది. ప్రతి రాష్ట్రానికి కేటాయించే సీట్ల సంఖ్యను కూడా అప్పుడే నిర్ణయిస్తారు. జనాభా పెరుగుదల అదుపులేకుండా జరిగినందుకు కొన్ని రాష్ట్రాలకు ప్రయోజనాలు కల్పిస్తారు. సంపూర్ణ ప్రజనన రేటు 2 శాతం, అంతకంటే తక్కువగా ఉండాలన్న నిర్దేశిత లక్ష్యాన్ని సాధించిన రాష్ట్రాలను సీట్ల కుదింపుతో శిక్షించనున్నారన్న ప్రచారం సాగుతోంది. ఇలా కేవలం జనాభా ప్తరాపిదకిగా కాకుండా మధ్యేమార్గం అవలంబించాల్సిన అసవరం ఇప్పుడు కనిపిస్తోంది. పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని తమిళనాడు సిఎం స్లాలిన్ పోరుబాట పట్టారు. జనాభా నిష్పత్తి సూత్రానికి అనుగుణంగా ఆయా రాష్ట్రాల సీట్ల సంఖ్యను పునర్ నిర్ధారించడం ద్వారా దక్షిణ్రాది రాష్ట్రాలకు నషటం జరగడం ఖాయంగా కనిపిస్తోంది. దక్షిణాది రాష్ట్రాల్లో ఇప్పుడు లోక్‌సభలో 129 స్థానాలున్నా వారి గళం పెద్దగా విన్పించడం లేదు. ఇప్పుడా సీట్ల సంఖ్య మరింతగా తగ్గితే దక్షిణాది ప్రతినిధుల మాటను కేంద్రం పట్టించుకోదు. సీట్ల సంఖ్య తగ్గించబోమనే హామిలో నిజాయితీ కొరవడింది. ఇదే సందర్భంలో జనాభా అత్యధికంగా ఉన్న యూపీ, బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌ల సీట్ల సంఖ్యను పెంచబోమని కేంద్రం స్పష్టంగా ప్రకటించడం లేదు. సీట్ల సంఖ్య పునర్ నిర్ధారణకు జనాభా నిష్పత్తి సూత్రాన్ని అనుసరించిన పక్షంలో దక్షిణాది రాష్ట్రాల బలం మరింతగా తగ్గిపోతుంది. పర్యవసానంగా పార్లమెంటులో దక్షిణాది వారి గళం వినిపించే వారి సంఖ్యా తగ్గుతుంది. ఈ రాష్ట్రాల సమస్యల పరిష్కారం పట్ల నిర్లక్ష్యం పెరుగుతంది. కొన్ని రాష్ట్రాలకు సీట్ల సంఖ్యను కుదించాలన్నా, పెంచాలన్నా ఇప్పుడున్న సీట్ల సంఖ్యను అనివార్యంగా పెంచాలి. రాష్ట్రాల సైజు బట్టి సీట్లను పెంచడం కూడా ఆలోచించాలి. లోక్‌సభకు ఎన్నికయ్యే ప్రతినిధుల సంఖ్యను విధిగా పెంచవలసి ఉంటుంది. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన, 1977లో రాజ్యాంగానికి 42వ సవరణ జరిగింది. లోక్‌సభలో ప్రస్తుతం రాష్ట్రాల నుంచి ఎన్నికైన ప్రతినిధులు 530 మంది, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 13 మంది ఉన్నారు. అధికరణ 81లోని నిబంధన 2(ఎ) ప్రకారం ప్రతి రాష్ట్రం నుండి లోక్‌సభకు ఎంతమంది ఎన్నిక కావాలనే విషయం ఆ రాష్ట్ర జనాభాపై ఆధారపడి ఉంటుంది. జనాభాకు, లోక్‌సభ సభ్యుల సంఖ్యకు గల నిష్పత్తి సాధ్యమైనంతవరకు అన్ని రాష్ట్రాలకు ఒకే విధంగా ఉంటే పేచీ ఉండదు. ఇకపోతే ప్రధానంగా మరో రాజ్యాంగ సవరణ కూడా చేయాల్సి ఉంది. ఇప్పుడున్న ఎంపిలు, ఎమ్మెల్యేలు వరుసగా వారే ఎన్నికవుతూ వస్తున్నారు.. కలు,ధనబలం ద్వారా ఒక్కరే ఆరేడు పర్యాయాలు సభ్యులుగా ఉంటున్నారు. ఇది పోవాల్సిన అవసరం ఉంది. 140 కోట్లు ఉన్న దేశంలో కొందరే నిరంతరంగా చట్టసభలను గబ్బిలాల్లో పట్టుకుని వెళ్లాడుతున్నారు. ఇందులో అన్ని పార్టీల వారూ ఉన్నారు. ఇది పోతేనే దేశం బాగుపడదు. అలాగే ప్రజాస్వామ్యం బలపడదు. దీనిపై బిజెపి దృష్టి పెట్టాల్సి ఉంది. కనీసం రెండు టర్మలకు మించి ఎన్నిక కాకుండా రాజ్యాంగ సవరణ చేయాలి. మూడో దఫాలో అధికారం చేపట్టిన మోడీ అనేక ఆశలు కల్పించారు. ఇలాంటి సంస్కరణలు చేపడితే ప్రజలు ఆమోదిస్తారు. హర్షిస్తారు. రాజకీయ పార్టీల నేతలు జీవితాంతం చట్టసభల్లో తిష్టవేయకుండా చేస్తే..దేశ ప్రయోజనాలు కాపాడిన వారు అవుతారు. ఇందుకు అన్ని రాజకీయ పార్టీలు తమ సచ్ఛీలతను చాటుకోవాల్సి ఉంది. ముందుగా మోడీ ఇందుకు సిద్దం కావాలి.

# ఏకకాల ఎన్నికలతో ఎవరికి లాభం?




న్యూఢిల్లీ,జమిలి ఎన్నికల అంశం ఇటీవల బాగా చర్చల్లో నిలుస్తోంది. ఒకేసారి ఎన్నికల విషయంలో కేంద్రం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. నిజానికి, జమిలి వల్ల మన ప్రజాస్వామ్యానికి లాభమా, నష్టమా?జమిలి ఎన్నికల వల్ల అనేక లాభాలున్నాయని వాటి అనుకూలురు వాదిస్తున్నారు. వారు చెబుతున్న మొదటి ప్రయోజనం ఆర్థిక సంబంధమైంది. అయిదేళ్లకు ఒకేసారి స్థానిక సంస్థలు, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను జరిపిస్తే ఎంతో డబ్బు, సమయం ఆదా అవుతాయని జమిలి సమర్థకులు అంటున్నారు.వేర్వేరుగా ఎన్నికలు నిర్వహిస్తే ప్రతిసారీ పెద్దయెత్తున ఎన్నికల నిర్వహణ సిబ్బందిని, భద్రతా దళాలను నియోగించాల్సి వస్తుంది. అది ఎంతో శ్రమతో, భారీ వ్యయంతో కూడుకున్నది. తరచూ ఎన్నికలు జరుగుతుండటం వల్ల ప్రతిసారీ ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చి ప్రభుత్వ విధానాల అమలు స్తంభించిపోతుంది. మంత్రులు, అధికారులు, సిబ్బంది దృష్టి యావత్తూ ఎన్నికలపైనే ఉండి ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోలేని అశక్తత ఆవహిస్తుంది- ఇవీ స్థూలంగా జమిలి ఎన్నికలవాదులు చెప్పే మాటలు. అయితే, వేర్వేరుగా ఎన్నికలు నిర్వహించడమే దేశానికి ప్రయోజనకరమని కాస్త లోతుగా విశ్లేషించుకుంటే మనకే అర్థమవుతుంది.

**ఆర్థిక అసమానతలు... వలసలు**

ఎన్నికలు లేనిదే ప్రజాస్వామ్యం లేదు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వానికే చట్టబద్ధత, న్యాయబద్ధత, సాధికారత ఉంటాయి. కింది నుంచి పైస్థాయి వరకు ఒక్కసారే ఎన్నికలు జరపాలా, విడివిడిగా పలు విడతల్లో నిర్వహించాలా అన్నది ఆర్థిక, నిర్వహణ, విధానపరంగా ఆచితూచి తీసుకోవాల్సిన నిర్ణయం. జమిలి ఎన్నికల వల్ల ఈ మూడు విభాగాల్లో ప్రయోజనాలు చేకూరే మాట నిజమే అయినా విడివిడి ఎన్నికలకు ఉండే ప్రయోజనాలు వేరు. భారత్ వంటి సువిశాల దేశంలో అన్ని రాష్ట్రాలకూ ఒకేసారి అసెంబ్లీ ఎన్నికలు జరపడం సమర్థనీయమా అనే ప్రశ్న తలెత్తుతుంది. పార్లమెంటు ఎన్నికల్లో ప్రాధాన్యం వహించే అంశాలకు అసెంబ్లీ ఎలక్షన్లలో అదే ప్రాముఖ్యత ఉండకపోవచ్చు. ఒక రాష్ట్ర ఎన్నికల్లో ఏవైనా లోపాలు దొర్లితే, తదుపరి ఎలక్షన్లు జరిగే రాష్ట్రంలో సరిదిద్దుకోవచ్చు. విడివిడిగా ఎన్నికలు జరిపించడం వల్ల చేకూరే ప్రయోజనమిది. అదీకాకుండా భారతదేశంలో ఉన్నది కేంద్రీకృత పాలనా వ్యవస్థ కాదు. సమాఖ్య (ఫెడరల్) వ్యవస్థ. ఇందులో స్థానిక స్వపరిపాలన సంస్థల ఎన్నికల బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే. స్థానిక సంస్థలు, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను ఒకేసారి జరపాలంటూ రాజ్యాంగ నిబంధనలను పొందుపరిస్తే, భవిష్యత్తులో ఏదో ఒక కారణం చూపి అసలు ఎన్నికలే జరిపించని సందర్భమూ తలెత్తవచ్చు. భారతదేశంలో కొన్ని రాష్ట్రాలు ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందితే మరికొన్ని చాలా వెనకబడి ఉన్నాయి. 1990ల్లో ఆర్థిక సరళీకరణ తరవాత కొన్ని రాష్ట్రాలు అభివృద్ధిలో బాగా ముందుకెళ్లాయి. ఇది ఆర్థికపరమైన అసమానతను సృష్టించింది. వెనకబడిన రాష్ట్రాల నుంచి సంపన్న రాష్ట్రాలకు వలసలు పెరిగాయి. ఇది స్థానికులకూ వలసవచ్చిన వారికీ మధ్య విభేదాలకు కారణమైంది. ప్రాంతీయ వాదం తలెత్తడానికి దారితీసింది. రాష్ట్రాల మధ్య ఇన్ని వ్యత్యాసాలు ఉన్నప్పుడు ఆయా రాష్ట్రాల ఎన్నికల్లో ప్రాధాన్యాంశాలు కూడా వేర్వేరుగా ఉండవచ్చు. అలాంటప్పుడు కేంద్ర, రాష్ట్ర, స్థానిక స్థాయుల్లో ఒకేసారి ఎన్నికలు జరపాలనడం సమంజసం కాదు.

**మరుగునపడే స్థానిక సమస్యలు**

వేర్వేరుగా ఎన్నికలు జరపడం శ్రమతో కూడుకున్న విషయమే. ఆర్థికంగానూ బాగా ఖర్చవుతుంది. కానీ, మన ఫెడరల్ ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి జమిలికన్నా వేర్వేరుగా ఎన్నికలు జరపడం మేలు. ముఖ్యంగా పంచాయతీలు, పురపాలక, నగర పాలక సంస్థల ఎన్నికలను అసెంబ్లీ, పార్లమెంటు ఎలక్షన్లతో కలిపి నిర్వహించడం స్థానిక ప్రజల ప్రయోజనాలకు మంచిది కాదు. ప్రజల ఆశలూ ఆశయాల సాధనకు జమిలి ఎన్నికలు సమర్థ సాధనాలు కాజాలవు. ఎందుకంటే ఏకకాల ఎన్నికల్లో జాతీయ అంశాలే ప్రధానంగా ప్రచారంలోకి వచ్చి, స్థానిక సమస్యలు మరుగున పడిపోతాయి. జమిలిలో జాతీయ పార్టీలదే పైచేయి అవుతుంది. ఈ తరహా ఎన్నికలు జాతీయ పార్టీలపై ప్రజాభిప్రాయ సేకరణగా మారి ప్రాంతీయ పార్టీల ప్రాధాన్యాన్ని తగ్గించగలవు. ఫెడరల్ స్వభావమూ దెబ్బతింటుంది. కుటుంబ నియంత్రణలో విజయవంతమైన దక్షిణాది రాష్ట్రాలకు జమిలి ఎన్నికల వల్ల అన్యాయం జరుగుతుందనే వాదం బలంగా వినిపిస్తోంది. జనాభా ప్రాతిపదికన జరిగే నియోజకవర్గాల పునర్విభజన వల్ల పార్లమెంట్‌లో దక్షిణ రాష్ట్రాల సీట్ల శాతం తగ్గిపోయి ఉత్తరాది రాష్ట్రాలది పెరగనుంది. ఆర్థిక సంఘం నుంచి వచ్చే నిధులూ తరుగుపడే అవకాశం ఉంది. దీనివల్ల జాతీయ విధానాల రూపకల్పనలో దక్షిణాది రాష్ట్రాలకు ప్రాతినిధ్యం క్షీణిస్తుంది. ఇలా ఏ రకంగా చూసినా జమిలి ఎన్నికలతో లాభంకన్నా నష్టమే ఎక్కువ అన్నది ప్రజాస్వామ్య హితైషుల ఆందోళన!

**శరీరానికి సత్తువేదీ?**

అరకొర ఆదాయాలు, పేదరికం మూలంగా ప్రపంచవ్యాప్తంగా చాలామందికి సమతులాహారం అందడంలేదు. చిన్నారులను ఈ సమస్య మరింతగా పీడిస్తోంది. ప్రపంచ ఆహార వ్యవసాయ సంస్థ లెక్కల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా శరీరానికి సత్తువనిచ్చే ఆహారానికి నోచుకోనివారు 280 కోట్ల మందికి పైగా ఉన్నారు. అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే పౌష్టికాహారం అందనివారు అల్ప, దిగువ మధ్యాదాయ దేశాల్లోనే ఎక్కువగా జీవిస్తున్నారు. ఆర్థిక స్థితిగతుల వారీగా ఆయా దేశాల్లో సమతులాహారం దక్కని వారి సంఖ్య, పౌష్టికాహారానికి దూరమైన మొత్తం జనాభాలో వారి శాతం...

## పార్టీ విధేయతలకు పెద్దపీట

అమరావతి, పార్టీ విధేయత, క్రమశిక్షణకు బిజెపి పెద్దపీట వేసింది. పార్టీని నమ్ముకుని పనిచేస్తున్న వారికి అవకాశం ఉంటుందని తెలిపింది. ఈ క్రమంలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థిగా సోమువీర్రాజు పేరు ఖరారైంది. ఆంధ్రప్రదేశ్ ఎన్డీఏ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీజేపీ తరపున సోము వీర్రాజు పేరును అధిష్టానం ఖరారు చేసింది. గతంలో కూడా సోమువీర్రాజు ఎమ్మెల్సీగా పనిచేశారు. అలాగే బీజేపీ రాష్ట్ర అధ్యక్షులుగా కూడా ఆయన పనిచేశారు. పొత్తులో భాగంగా ఇప్పటికే ఒక ఎమ్మెల్సీ అభ్యర్థి స్థానాన్ని బీజేపీకి కేటాయించారు. నామినేషన్లకు చివరి రోజు కావడంతో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా సోమువీర్రాజు పేరును ఖరారు చేసినట్లు బీజేపీ శాసనసభాపక్ష నేత విష్ణుకుమార్ రాజుకు ఢిల్లీ నుంచి సమాచారం అందించారు. గతంలో 2014 నుంచి 2019 మధ్య కాలంలో సోమువీర్రాజు ఎమ్మెల్సీగా పనిచేశారు. ఆ తరువాత బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కూడా వ్యవహరించారు. ఆయన తరువాత దగ్గుబాటి పురందేశ్వరి రాష్ట్ర అధ్యక్షురాలిగా వ్యవహరిస్తున్నారు. అయితే బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా చివరి నిమిషం వరకు బీజేపీ సీనియర్ నేత పాకాల సత్యనారాయణ, సోమువీర్రాజు విషయంలో పార్టీ హైకమాండ్ కాస్త తర్జనభర్జనకు గురైనప్పటికీ చివరకు సోమువీర్రాజు పేరునే ఖరారు చేసింది అధిష్టానం. సోము వీర్రాజు గోదావరి జిల్లాకు చెందిన బిసి నేత కావడంతో పాటు, పార్టీకి విధేయంగా ఉంటూ వస్తున్నారు.

# గరిమెళ్ల పార్థివదేహానికి పలువురి నివాళి

తిరుపతి,:బాలకృష్ణ ప్రసాద్ పార్థివ దేహానికి మంగళవారం తిరుపతిలో అంత్యక్రియలు జరగనున్నాయి. ఆదివారం గుండెపోటుతో మరణించిన గరిమెళ్లకకు అనేకులు సంతాపం తెలిపారు. ఆయన భార్య పేరు జి.రాధ. అమెరికాలో ఉన్న ఆయన కుమారులు పవన్‌కుమార్, అనిల్‌కుమార్ మంగళవారం తిరుపతికి చేరుకోనున్నారు. వారు వచ్చాక అంత్యక్రియలు పూర్తి చేస్తారు. చిన్న కుమారుడు అనిల్‌కుమార్‌తో కలిసి బాలకృష్ణ ప్రసాద్ పలు సంగీత కార్యక్రమాల్లో పాటలు పాడారు. తిరుపతి భవానీనగర్‌లో స్థిరనివాసం ఏర్పరచుకున్న బాలకృష్ణ ప్రసాద్ గృహం సంగీత పాఠశాలలా ఉంటుందని ఆయన అభిమానులు, శిష్యులు చెబుతుంటారు. ఆయన ఎందరికో అన్నమాచార్య కీర్తనలు పాడడం నేర్పారు. వేలమంది శిష్యులను అక్కున చేర్చుకొని విద్యను అందరికీ పంచారు. సంప్రదాయ కర్ణాటక సంగీతంతో పాటు లలిత, జానపద సంగీతంలోనూ పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. ఆయనకు తంబుర వాయిద్యం అంటే మక్కువ. తితిదే ఆస్థాన విద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ మృతిపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తన మధుర గాత్రంతో శ్రీవేంకటేశ్వరస్వామి కృపాకటాక్షాలకు ఆయన పాత్రులయ్యారని, అలాంటి మహనీయుడు మనల్ని వదిలి వెళ్లడం బాధాకరమని పేర్కొన్నారు. '1978 నుంచి 2006 వరకు తితిదేలో ఆస్థాన గాయకుడిగా పనిచేసిన గరిమెళ్ల.. 600లకు పైగా అన్నమాచార్య సంకీర్తనలకు స్వరకల్పన చేశారు. సంప్రదాయ కర్ణాటక, జానపద, లలిత సంగీతంలోనూ ప్రవీణులైన ఆయన శ్రీవారి సేవలో తరించారు' అని ఆదివారం 'ఎక్స్'లో చంద్రబాబు కొనియాడారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ మృతిపై జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ విచారం వ్యక్తం చేశారు. 'ఈ తరానికి అన్నమాచార్య కీర్తనలను చేర్చేందుకు ఆయన ఎంతో తపించి పలు కార్యక్రమాలు నిర్వహించారు. బాలకృష్ణ ప్రసాద్ ఆత్మకు శాంతి చేకూరాలని వేంకటేశ్వరస్వామిని ప్రార్థిస్తున్నా' అని పేర్కొన్నారు. సంప్రదాయ, జానపద, లలిత సంగీతాల్లో తనదైన ముద్ర వేసిన గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ మృతి సంగీత ప్రపంచానికి తీరని లోటని మంత్రి నారా లోకేశ్ అన్నారు. తితిదే ఆస్థాన సంగీత విద్వాంసులు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ మృతిపై తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, అధికారులు, ఉద్యోగులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన పార్థివదేహం వద్ద అనేకులు నివాళి అర్పించారు. అన్నమయ్య పదార్చనకే అంకితమై.. అనుదినం తన స్వరమాధుర్యంతో పండిత పామరులందరినీ భక్తి పారవశ్యంలో ముంచెత్తిన విఖ్యాత సంగీత విద్వాంసులు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ (76) స్వరం మూగబోయింది. తిరుపతి భవానీనగర్‌లో తన స్వగృహానికి సమీపంలో నడకకు వెళ్లిన ఆయన ఆదివారం గుండెపోటుతో కన్నుమూశారు. ప్రతి శుక్రవారం తితిదే ఆలయాల్లో ఆయన ప్రత్యక్షగానం ఇక వినిపించదనే చేదునిజాన్ని ఆయన శిష్యబృందం, అన్నమాచార్యుల అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ 1948 నవంబరు 9న రాజమహేంద్రవరంలో కృష్ణవేణి, నరసింహారావు దంపతులకు జన్మించారు. కర్ణాటక సంగీతంలో డిప్లొమా చేశారు. ఆల్ ఇండియా రేడియోలో ఏ గ్రేడ్ గాయకులుగా రాణించారు. తితిదేకి చెందిన అన్నమాచార్య ప్రాజెక్టులో 1978లో గాత్ర కళాకారుడిగా ప్రవేశించి ఆస్థాన విద్వాంసుని హోదాకు ఎదిగారు. సంగీత కళానిధి నేదునూరి కృష్ణమూర్తి ఆయన గురువు. గరిమెళ్ల వెయ్యికి పైగా అన్నమాచార్య కీర్తనలకు సంగీతాన్ని అందించడమే కాకుండా తితిదే కోరిక మేరకు 800 పాటలను రికార్డింగ్ చేశారు. 50కి పైగా శాస్త్రీయ కృతులను విడుదల చేశారు. 300కు పైగా లలిత సంగీత పాటలకు గాత్రాన్ని అందించారు. అహోబిల మఠం ఆస్థాన గాయకుడిగా వ్యవహరించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నుంచి 2023 ఫిబ్రవరి 23న కేంద్ర సంగీత, నాటక అకాడమీ అవార్డును గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ అందుకున్నారు. శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం అవార్డు, కేంద్ర సంగీత, నాటక అకాడమీ అవార్డును గరిమెళ్ల అందుకున్నారు. దేశవిదేశాల్లో 6వేల సంగీత కచేరీలు చేయడం విశేషం. తితిదే ద్వారా అన్నమాచార్యులకు సంబంధించి 12 ప్రచురణలు అందించారు. 25కు పైగా రాగాలను అన్నమయ్య పాటలు, స్వీయకృతులకు సృష్టించారు. ఈ నెల 6న యాదగిరిగుట్టలో జరిగిన బ్రహ్మోత్సవాల్లో సైతం ఆయన తన గీతాలాపనతో ఆధ్యాత్మికతను పంచారు.

# కేసీఆర్ కూడానా ?

అమరావతి,ఏపీలో జగన్ చేసినట్లే తెలంగాణాలో కేసీఆర్ చేయబోతున్నారా అంటే ప్రస్తుతానికి అయితే అదే అనిపిస్తోంది అని అంటున్నారు. ఈ ఇద్దరికీ వయసులో రాజకీయ అనుభవంలో తేడా ఉండొచ్చు కానీ ఆలోచనలు వ్యూహాలు ప్రత్యర్థుల విషయంలో వారి విధానాల విషయంలో కొన్ని పోలికలు ఉంటాయని అంటున్నారు.ఈ ఇద్దరూ ఒక పట్టాన రాజీపడరు. తాము అనుకున్నదే చేస్తారు. తమకు ఉన్న ప్రజా బలం మీద అపారమైన నమ్మకం. అదే విధంగా విపక్ష పాత్ర పోషించాలంటే ఇద్దరికీ అంతగా ఇష్టం ఉండటం లేదని అంటున్నారు. తెలంగాణాలో చూసుకుంటే మాజీ సీఎం కేసీఆర్ గత ఏడాది జరిగిన బడ్జెట్ సమావేశాలలో ఒకసారి మెరిసారు. ఆ తరువాత ఆయన మళ్ళీ రాలేదు.ఈ మధ్యలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి సందర్భంగా తెలంగాణా అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశం జరిపినా కేసీఆర్ హాజరు కాలేదు. మన్మోహన్ సింగ్ కేబినెట్ లో కొన్నాళ్ళ పాటు మంత్రిగా కేసీఆర్ పనిచేశారు. ఆయన ప్రధానిగా ఉండగానే తెలంగాణా రాష్ట్రం వచ్చింది. అందుకేనా ఆయన వస్తారు అనుకున్నా హాజరు కాలేదు. స్పీకర్ స్వయంగా రమ్మని ఫోన్ లో కోరినా రాలేదు.ఇక ఇపుడు చూస్తే ఈ నెల 12 నుంచి తెలంగాణా అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ సమావేశాలకు కేసీఆర్ హాజరవుతారా అంటే ప్రస్తుతం జరుగుతున్న ప్రచారం బట్టి చూస్తే రావచ్చు అని అంటున్నారు. కేసీఅర్ గత ఏడాది చేసినట్లుగానే సభకు ఒక రోజు వచ్చి కొంత సేపు కూర్చుని ఆ మీదట ఆయన మీడియా పాయింట్ వద్ద తాను చెప్పాల్సింది చెప్పేసి వెళ్ళిపోతారు అని అంటున్నారునిజానికి కేసీఅర్ సభకు హాజరు కావాలని అధికార కాంగ్రెస్ కోరుతోంది. ఆయన పదేళ్ళ పాలన తీరుని సభలోనే ఎండగడతామని అంటోంది. కేసీఆర్ కూడా సమాధానం చెప్పుకోవచ్చని అంటోంది. అయితే కేసీఆర్ మాత్రం రేవంత్ రెడ్డి సీఎం గా ఉన్న సభలో హాజరు కాకూడదని భావిస్తున్నారు అని అంటున్నారు. అంతే కాకుండా తనను నేరుగా టార్గెట్ చేస్తూ విమర్శలు చేస్తూంటే సభలో ఉండాల్సిన అవసరం ఉందా అని అంటున్నారు.మరో వైపు చూస్తే కనుక ఏపీలో జగన్ కూడా బడ్జెట్ సెషన్ లో ఒక్క రోజే హాజరు అయి సభ నుంచి వెళ్ళిపోయారు. ఆయన కూడా గత ఏడాది ఇదే విధంగా చేశారు. జగన్ కూడా సభలో ఉండేందుకు ఇష్టపడటం లేదు. జగన్ సభకు వస్తే ఆయన అయిదేళ్ళ పాలన మీద ఎండగట్టాలని కూటమి ప్రభుత్వం చూస్తోంది. కానీ జగన్ వారికి ఆ చాన్స్ ఇవ్వడంలేదు. ప్రతిపక్ష హోదా ఇస్తేనే సభకు అని అంటున్నారు.ఆ హోదా ఎటూ ఇవ్వరనే తెలిసి ఆయన ఈ మెలిక పెట్టారని అంటున్నారు. ఇలా జగన్ సభకు హాజరు కాకపోవడానికి తప్పు అంతా అధికార కూటమి మీదనే పెడుతున్నారు. కానీ తాము అలా ఇవ్వలేమని అధికార పార్టీ చెబుతోంది. సో జగన్ కూడా విపక్షంలో కూర్చోవడానికి ఇబ్బంది పడుతున్నారని అంటున్నారు.కేసీఆర్ విషయం తీసుకుంటే ఆయనకు ప్రధాన ప్రతిపక్ష హోదా అయితే ఉంది. కానీ ఆయన సభకు రావడం లేదు.

# పేదరిక నిర్మూలన లక్ష్యంగా స్వర్ణాంధ్ర

విజయవాడ,సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఆవిష్కరించిన స్వర్ణాంధ్ర @ 2047లో భాగంగా పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు జీరో పావర్టీ-పీ4 విధానం అమలుకు కసరత్తు జరుగుతోందని.. ఈ ప్రయాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర@2047 విజన్ డాక్యుమెంట్‌లో పది సూత్రాల్లో మొదటి సూత్రమైన పేదరికం నిర్మూలనం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్‌షిప్ (పీ4) విధానానికి ఉగాది నుంచి శ్రీకారం చుట్టనుందని.. ప్రభుత్వం, దాతలు, ప్రజాభాగస్వామ్యంతో పేదరికం లేని సమాజం లక్ష్యంగా ఈ పీ4 విధానం అమలుకానుందని వివరించారు. ముఖ్యంగా యువతకు జ్ఞానం, నైపుణ్యాలు అందించడం, ప్రతిఒక్కరికీ మెరుగైన వైద్య సేవలు, సుస్థిర ఉపాధి అవకాశాల సృష్టి, వృద్ధికి దోహదం చేసే మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించేందుకు ఇది తోడ్పడుతుందన్నారు. సమాజం నుంచి పేదరికాన్ని దూరం చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికాయుతంగా చేపడుతున్న కార్యక్రమాలకు తోడు సామాజికంగా, ఆర్థికంగా పైన ఉన్న కుటుంబాలు సామాజిక బాధ్యతగా అట్టడుగున ఉన్న కుటుంబాలకు మద్దతుగా నిలిచేలా భాగస్వాములను చేయడం పీ4 విధానమని పేర్కొన్నారు. ఈ బృహత్తర కార్యక్రమంపై ప్రజల నుంచి సూచనలు తీసుకోవడం జరుగు తోందన్నారు. ఈ నెల 25వ తేదీలోగా అభిప్రాయాలు తెలియజేసి.. ప్రతి ఇంటికీ అభివృద్ధి, ప్రతి జీవితానికీ ప్రగతిలో భాగస్వాములు కావాలని, మీ సలహాలను ప్రశంసిస్తూ ఒక ప్రశంసా పత్రం కూడా అందించడం జరుగుతుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

## దాల సహకారంతో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం

అమరావతి,కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో కలెక్టరేట్లు, రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, అవసరమైన చోట తహసీల్దారు కార్యాలయాలను నిర్మిస్తామని రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. శాసనసభలో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ల నిర్మాణంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చిన ఆయన.. కొత్త జిల్లాల్లో కలెక్టరేట్లు, రెవెన్యూ డివిజన్ ఆఫీసులు, అవసరమైన చోట తహసీల్దార్ కార్యాలయాలను నిర్మిస్తామని అన్నారు.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉన్నందున దాతల సహాయంతో నిర్మాణాలు చేపట్టేందుకు కసరత్తు చేస్తున్నాం అని వెల్లడించారు. దాతల నుండి నిధులు ఎలా సేకరించాలి, ఎలా ఖర్చు పెట్టాలనే అంశాలపై అధికారులు అధ్యయనం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో వారి పార్టీ కార్యాలయాలను కట్టకోవాలనే తపన తప్ప కొత్త కలెక్టరేట్లు కట్టాలన్న ఆలోచన చేయలేదు అని మండిపడ్డారు.. ఇక, వివిధ వర్గాల ప్రజలు చేస్తున్న ఆందోళనల నుండి ప్రజల దృష్టిని మరల్చించేందుకు అశాస్త్రీయంగా జిల్లాల విభజన చేశారు. కానీ, జిల్లాల విభజనలో గత ప్రభుత్వంలో చోటుచేసుకున్న లోపాలను వరుసగా సరిచేస్తున్నామని వెల్లడించారు.

# అటు ఇటు సుంకాలు తగ్గుతాయా?



న్యూఢిల్లీ,ఏప్రిల్ 2 నుంచి భారత్‌పై అమెరికా విధిస్తున్న భారీ సుంకాల భారాన్ని తగ్గించుకోడానికి భారత్ చేస్తున్న ప్రయత్నాలు ఒక కొలిక్కి వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. అమెరికాపై సుంకాల తగ్గింపునకు భారత్ అంగీకరించిందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించడం చెప్పుకోదగిన పరిణామం. అమెరికా ఉత్పత్తులు భారత్‌లో విక్రయించడానికి వీలు లేనంత భారంగా ఉన్నాయని తప్పుపట్టడంతో సుంకాలను తగ్గించడానికి భారత్ అంగీకరించిందని ట్రంప్ వివరించారు. ఈ సుంకాల తగ్గింపు ఏయే దిగుమతులపై ఉంటుందో ఇంకా వివరాలు బయటపడలేదు. గత వారం రోజులుగా కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ వాషింగ్టన్ డీసీలో మకాం పెట్టి అమెరికా వాణిజ్య అధికార వర్గాలతో చర్చలు జరుపుతున్నారు.గురువారం బహుళ వాణిజ్య ద్వైపాక్షిక ఒప్పందాన్ని అమెరికా ముందుకు తీసుకువచ్చారు. ఈ ఒప్పందం సంగతి ఎలా ఉన్నా భారీ స్థాయిలో వాణిజ్య లావాదేవీలు జరగాలని, ఆ మేరకు అమెరికా దిగుమతులపై భారత్ భారీ సుంకాల విధింపు బాగా తగ్గాలని అమెరికా కాంక్షిస్తోంది. ఉత్పత్తుల వారీగా కాకుండా అన్నిటితోపాటు వ్యవసాయ ఉత్పత్తులను కూడా చేర్చాలని అమెరికా షరతు పెట్టడం భారత్‌కు అగ్నిపరీక్షే. వ్యవసాయ ఉత్పత్తుల సుంకాల విషయంలో ఎలాంటి మినహాయింపు కల్పించినా స్వదేశీ వ్యవసాయదారులకు నష్టాలే తప్ప ప్రయోజనం ఉండబోదని భారత్ తర్జనభర్జన పడుతోంది. అమెరికాకు మనం ఎగుమతి చేస్తున్న వ్యవసాయ ఉత్పత్తులపై దాదాపు 37.66 శాతం వరకు సుంకాలు విధిస్తున్నాం.అదే అమెరికా నుంచి మన దేశానికి దిగుమతి అయ్యే వ్యవసాయ ఉత్పత్తులపై కేవలం 2.59 శాతం మాత్రమే అమెరికా సుంకం విధిస్తోంది. ఈ తేడా 32 శాతం వరకు ఉండడం అమెరికాకు అసంతృప్తి కలిగిస్తోంది. అందుకనే వ్యవసాయ ఉత్పత్తులపై భారీగా సుంకాలు తగ్గించాలని అమెరికా పట్టుబడుతోంది. 2022లో భారత్ ఉత్పత్తులపై అమెరికా సుంకాల విధింపు 3.83 శాతం వరకు ఉండగా, అదే సమయంలో భారత్ 15.3 శాతం సుంకాలను విధించడం గమనార్హం. లగ్జరీ కార్లు, కెమికల్స్, ఎలక్ట్రానిక్స్‌పై 125 శాతం, మద్యంపై 150 శాతం భారత్ సుంకాలు విధిస్తోంది. అందుకనే భారత్ టారిఫ్ కింగ్, బిగ్ అబ్యూజర్ అని ట్రంప్ పదేపదే భారత్‌పై నిందారోపణలు చేయడం తెలిసిందే.భారత్‌లో అమెరికా వాణిజ్య లోటు 100 బిలియన్ డాలర్ల (రూ. 8.70 లక్షల కోట్లు) వరకు ఉందని, ఈ లోటును తగ్గించాల్సిందేనని ట్రంప్ డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం భారత్ కార్ల దిగుమతిపై 110% సుంకాలు విధిస్తోంది. ప్రపంచం లోనే కార్లపై అత్యధిక సుంకాలు విధించే దేశంగా భారత్‌ను టెస్లా అధినేత ఎలాన్‌మస్క్ తీవ్రంగా ధ్వజమెత్తారు కూడా.ఇప్పుడు మస్క్ సంస్థను సుంకాలు లేకుండా భారత్‌లో ప్రవేశపెట్టడానికి, అమెరికా నుంచి దిగుమతి అయ్యే కార్లపై సుంకాలను పూర్తిగా తొలగించేలా చర్చలు జరుగుతున్నాయి. ఈ విధమైన భారం అమెరికాకు భారత్ నుంచి ఉండరాదని అమెరికా వాణిజ్య మంత్రి హొవార్డ్ లుట్నిక్ స్పష్టం చేస్తున్నారు. అప్పుడే భారత్ అమెరికా సంబంధాలు బలోపేతం అవుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అమెరికా నుంచి భారత్‌కు కొన్ని ఆంక్షలు ఎదురయ్యాయి.ఆయుధాల కోసం రష్యాపై ఆధారపడకూడదు. దీనికి ప్రత్యామ్నాయంగా అధునాతన అమెరికన్ రక్షణ వ్యవస్థలు భారత్‌కు సమకూరుతాయి. డాలర్‌కు బదులుగా కొత్త కరెన్సీని చెలామణి లోకి తీసుకురాడానికి బ్రిక్స్ ప్రయత్నించరాదు. ఈ ఆంక్షల నేపథ్యంలో అమెరికాపై సుంకాల తగ్గింపునకు భారత్ అంగీకరించడం అమలులోకి వస్తే అమెరికా ప్రతీకార సుంకాల విధింపులో కాస్త వెనక్కు తగ్గుతుందని భారత్ భావిస్తోంది. ప్రత్యేకంగా స్టీల్, అల్యూమినియంపై 25 శాతం ప్రతీకార సుంకం మార్చి 12 నుంచి అమలవుతుందని అమెరికా ప్రకటించింది. ఇందులో ఎంతవరకు వెసులుబాటు లభిస్తుందో గమనించాలి. అమెరికాపై విధిస్తున్న సుంకాల తగ్గింపునకు భారత్ ఇప్పటికే చర్యలు ప్రారంభించింది.భారత్‌లో అనేక వస్తువులు ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్ లేదా ఆటోలు, బైక్‌లపై సుంకాలు తగ్గిస్తే భారత పారిశ్రామిక రంగంపై అంతగా ప్రభావం ఉండదని చెబుతున్నారు. ఏయే వస్తు ఉత్పత్తులపై సుంకాలు తగ్గించవచ్చునో వాటిని గుర్తించడానికి భారత్ ప్రయత్నిస్తోంది. ఇటీవలి బడ్జెట్‌లో స్మార్ట్‌ఫోన్ దిగుమతులపై ప్రకటించిన 15 16 శాతం సుంకాల నుంచి అమెరికాను మినహాయించడానికి సిద్ధమైంది. అదే విధంగా వైద్య పరికరాలు, లగ్జరీ మోటార్ సైకిళ్లు వంటి అనేక అమెరికా ఉత్పత్తులపై సుంకాలు తగ్గించే చర్యలు చేపట్టింది. అమెరికాకు అతిపెద్ద ఎగుమతిదారుల్లో భారత్ ఒకటి. 2024లో అమెరికాకు 87.4 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులను భారత్ ఎగుమతి చేసింది.అదే సమయంలోఅమెరికా నుంచి 41.8 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులను మాత్రమే భారత్ దిగుమతి చేసుకుంది. ఈ వాణిజ్య లోటుపైనే ట్రంప్ నిలదీస్తున్నారు. ఈ క్రమంలో గతనెల భారత ప్రధాని మోడీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో భేటీ అయినప్పుడు వాణిజ్య లోటును తగ్గించే ప్రయత్నాల్లో భాగంగా అమెరికా నుంచి రక్షణ, చమురు తదితర ఉత్పత్తుల దిగుమతులను భారీగా పెంచేందుకు అంగీకారం కుదిరింది కూడా. సుంకాల విషయంలో దిద్దుబాటు చర్యలేవీ తీసుకోకుంటే 25 బిలియన్ డాలర్ల విలువైన భారత్ ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడవచ్చు. అయితే మన జిడిపిలో అమెరికా ఎగుమతుల వాటా కేవలం 2.2 శాతమే కాబట్టి భారత్ అంతగా భయపడనక్కర లేదని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు.

# ఎమ్మెల్సీ స్థానాల్లో పలువురికి నిరాశ

విజయవాడ, ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి టిక్కెట్లు ఆశించి భంగపడ్డ టిడిపి నేతలు నిర్వేదం ప్రకటించారు. పొతతులకు తోడు ఉన్న మూడు సీట్లలో సర్దుబాట్ కారణంగా తమకు సీటు దక్కలేదని ప్రకటించారు. బుద్దా వెంకన్న, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎన్‌వఇఎస్ వర్మలు తమకు టిక్కెట్లు దక్కకపోవడంతో ఆవేదన చెందినా, అంతిమ నిర్ణయం పార్టీ అధినేతదేనని అన్నారు. పొత్తులో పోగా మిగిన మూడు ఎమ్మెల్సీలకు అభ్యర్థులను తెలుగుదేశం పార్టీ ప్రకటించింది.. ఐదు స్థానాలను ఎన్నికలు జరగనుండగా.. జనసేన, బీజేపీకి తలో సీటు కేటాయించి.. మిగతా మూడు స్థానాలకు కావలి గ్రీష్మ.. బీద రవిచంద్ర.. బీటీ నాయుడు పేర్లను ఖరారు చేశారు . ఇప్పటికే జనసేన అభ్యర్థిగా నాగబాబు నామినేషన్ దాఖలు చేయగా.. సోము వీర్రాజు పేరును సోమవారం ఖరారు చేసింది బీజేపీ.. అయితే, గత ఎన్నికల్లో ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీకి సిద్ధమైన బుద్దా వెంకన్నకు సర్దుబాట్లలో భాగంగా సీటు దక్కలేదు.. కానీ, ఈ సారి ఎమ్మెల్సీ సీటు వస్తుందనే నమ్మకంతో ఉన్న ఆయనకు అది సాధ్యం కాలేదు.. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ తనకు రాకపోవటంపై మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.చంద్రబాబు నాయుడు నాకు దేవుడు.. నేను ఆయన భక్తుడిని అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు బుద్దా వెంకన్న.. దేవుడు కూడా అప్పుడప్పుడు పరీక్ష పెడతాడు.. కానీ, నాకు పదవి వచ్చినా.. రాకపోయినా.. అంకిత భావంతో పనిచేస్తాను అని స్పష్టం చేశారు.. రాజకీయాల్లో పదవి అనేది ఒక క్రీడగా అభివర్ణించిన ఆయన.. ఒక్కోసారి పదవి వస్తుంది.. ఒక్కోసారి రాదు.. ఏ సందర్భంలో నైనా నేను ఒకేలా ఉంటాను అని పేర్కొన్నారు.. నాకు పదవి రాకపోయినా బాధ పడను అని వ్యాఖ్యానించారు.. అనేక ఈక్వేషన్స్ తో ఎమ్మెల్సీల ఎన్నిక జరిగిందన్నారు.. కొత్త ఎమ్మెల్సీలకు శుభాకాంక్షలు తెలిపారు.. ఈ ముగ్గురికి ఎమ్మెల్సీ ఇవ్వటం సరైందే అన్నారు. తెదేపా ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటించిన నేపథ్యంలో కార్యకర్తలతో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ నేత ఎస్వీఎస్ఎన్ వర్మ సమావేశమయ్యారు. ఎమ్మెల్సీ పదవి దక్కకపోవడంపై ఆయన మాట్లాడారు. 'రాజకీయాల్లో కొన్ని ఇబ్బందులు ఉంటాయి. నియోజకవర్గ స్థాయిలోనే పదవులు విభజించాలంటే మదనపడతాం. అలాంటిది రాష్ట్రవ్యాప్తంగా పదవులు ఇవ్వాలంటే అనేక ఇబ్బందులు ఉంటాయి. ఆ పరిస్థితులను అర్థం చేసుకుంటాం. తెదేపా అధినేత, సీఎం చంద్రబాబుతో 23 ఏళ్ల ప్రయాణంలో ఎన్నో సమస్యలపై పనిచేశాం. చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఆదేశాలకు నాతో పాటు నా కుటుంబం, పిఠాపురం నియోజకవర్గ తెదేపా కార్యకర్తలు కట్టుబడి ఉంటారు. పార్టీ కార్యకర్తల కష్టాల్లో తోడుగా ఉంటాం' అని వర్మ తెలిపారు.

# అసోంలో ఎస్టీ హోదా కోసం కోచ్-రాజ్‌బోంగ్షీల ఆందోళన

గౌమతి,అస్సాంలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పర్యటన నేపథ్యంలో కోచ్-రాజ్‌బోంగ్షీలు ఎస్‌టి హోదా డిమాండును తిరిగి లేవనెత్తారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా అమిత్‌షా మార్చి 14న అస్సాం చేరుకోనున్నారు. పశ్చిమ అస్సాం, ఉత్తర పశ్చిమబెంగాల్ ప్రాంతాలలో నివసించే అతిపెద్ద ఆరు ప్రాచీన తెగలలో ఒకటైన కోచ్-రాజ్‌బోంగ్షీలు దశాబ్దాలుగా ఎస్‌టి హోదా కల్పించాలని డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఆదివాసీలు, అహోంలు, చుటియాలు, మటాక్స్, మారన్‌లు మిగిలిన తెగలు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ సైకియాకు శనివారం వినతిపత్రాన్ని సమర్పించామని మంచా ప్రతినిధి ఒకరు తెలిపారు. 2025 ఏప్రిల్ 30 నాటికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో త్రైపాక్షిక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని బిజెపికి అల్టిమేటం జారీ చేసినట్లు తెలిపారు. గతంలో మాదిరిగా 2026 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూడా ఎన్నికల హామీల పేరుతో తమను మోసం చేస్తే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించినట్లు పేర్కొన్నారు. మంచా అనేది కోచ్-రాజ్‌బోంగ్షీ తెగకు చెందిన 12 సంస్థలతో కూడిన ప్రధాన సంస్థ. దాదాపు మూడు దశాబ్దాలుగా ఎస్‌టి హోదా కోసం డిమాండ్ చేస్తున్నాయి. 2014 లోక్‌సభ ఎన్నికలకు ముందు బిజెపి ఆరు తెగలకు ఎస్‌టి హోదాను కల్పించినప్పటికీ.. తమ తెగను పక్కన పెట్టినట్లు ఆ ప్రతినిధి ఆగ్రహం వ్యక్తం చేశారు.

# బిగిస్తున్న ఉచ్చు..

విజయవాడ: వైసీపీ నేత, మాజీ మంత్రి రోజా చుట్టూ ఉచ్చు బిగుస్తోందా? 'ఆడుదాం ఆంధ్ర' ఆటల కార్యక్రమం స్కామ్‌గా మారిందా? టీడీపీ సభ్యులు కొత్తగా లేవనెత్తిన అంశాలేంటి? దీనిపై మంత్రి రాంప్రసాద్ ఏమన్నారు? అవినీతి చేసినవాళ్లను బయటపెడతారా? అవుననే సంకేతాలు ఇచ్చారు సదరు మంత్రి. సోమవారం సభలో అసలేం జరిగింది?

అసెంబ్లీలో మంత్రి వివరణ

ఏపీలో అసెంబ్లీలో సోమవారం 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంపై టీడీపీ సభ్యులు పలు ప్రశ్నలు లేవనెత్తారు. దీనిపై మంత్రి రాంప్రసాద్ కీలక విషయాలు బయటపెట్టారు. ఆడుదాం ఆంధ్రా ప్రోగ్రాం కోసం వైసీపీ ప్రభుత్వం రూ. 119.19 కోట్లు ఖర్చు చేసిందన్నారు. ఈ ఖర్చంతా కేవలం 47 రోజుల్లో పూర్తి చేశారని తెలిపారు.

ఖర్చు పెట్టిందిలా?

ఈ మొత్తాన్ని ఆర్ అండ్ బీ స్పోర్ట్స్ డిపార్టుమెంట్- జిల్లా కలెక్టర్లు ద్వారా ఖర్చు చేశారని వెల్లడించారు. ఖర్చు చేసిన వివరాలను బయటపెట్టారు సదరు మంత్రి. స్పోర్ట్స్ కిట్స్ కోసం రూ. 38.55 కోట్లు, టీ షర్టులు-క్యాప్స్ కోసం రూ. 34.02 కోట్లు, జిల్లా కలెక్టర్లు, స్పోర్ట్స్ అకౌంట్‌కు రూ. 40.93 కోట్లు డిపాజిట్ చేశారని వివరించారు. అందులో 21 కోట్ల రూపాయలను ఆప్ సైటింగ్ ఛార్జీలుగా ఉన్నాయని తెలిపారు.

ప్రైజ్ మనీ మాటేంటి?

ఇక ప్రైజ్ మనీ కోసం రూ. 12.21 కోట్ల ఖర్చు చేసినట్టు తెలిపారు. దీనిపై టీడీపీ సభ్యులు పలు ప్రశ్నలు లేవనెత్తారు. ఆ శాఖ నుంచి తీసుకున్న రిపోర్టు ఆధారంగా కొన్ని విషయాలు బయటపెట్టారు. టీడీపీ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పలు ప్రశ్నలు లేవనెత్తారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ముఖ్య ఉద్దేశం క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించడం మాత్రమేనని అన్నారు.

పవన్ సీరియస్.. ఆ నేతపై చర్యలకు ఆదేశం

గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు చేపట్టే కార్యక్రమమని తెలిపారు. కేవలం 47 రోజుల కార్యక్రమానికి దాదాపు రూ.120 కోట్లు ఖర్చు చేయడం విడ్డూరంగా ఉందన్నారు అఖిల ప్రియ. ఆటగాళ్లు, ఆటలను ప్రోత్సహించినట్టు ఎక్కడా కనిపించలేదన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఇచ్చిన కిట్స్ ఎలాంటి నాణ్యత లేదన్నారు.పబ్లిసిటీ కోసం ఆయా వస్తువులపై స్టిక్కర్లు వేశారన్నారు. నార్మల్‌గా అయితే గ్రామ, మండలం, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు ఆటలను కండక్టర్ చేయాలన్నారు. వచ్చిన ఆటగాళ్ల ఆహారం, ట్రాన్స్ పోర్టు, సదుపాయాలు, గ్రౌండ్స్, కిట్స్ కోసం ఆ మొత్తాన్ని ఖర్చు చేశారన్నారు. నిర్వహించిన ఆటల విషయానికొస్తే.. కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, క్రికెట్, వాలీవాల్ (మెన్ అండ్ వుమెన్) నిర్వహించారని చెప్పారు.ఇప్పటివరకు చేసిన ఖర్చు గురించి మాత్రమే మంత్రి చెప్పారని అన్నారు అఖిలప్రియ. ఎక్కడ అవినీతి జరిగిందనే దానిపై క్లారిటీ ఇవ్వలేదన్నారు. వాలంటీర్ల ద్వారా ఫేక్ ఆధార్ కార్డులు తీసుకుని రిజిస్ట్రేషన్ చేయించడం జరిగిందన్నారు. క్వాలిటీ లేని స్పోర్ట్స్ కిట్స్ ఇచ్చారన్నారు. పబ్లిసిటీ దాదాపు రూ. 35 కోట్ల ఖర్చు చేశారని వివరించారు (స్టిక్కర్లు, హోర్డింగులు, సోషల్ మీడియా ప్రచారం) సదరు ఎమ్మెల్యే. గెలిచిన వారికి 12 కోట్లు ఇస్తామని చెప్పారని, ఇప్పటివరకు ఆటగాళ్ల ఖాతాల్లో నిధులు పడలేదన్నారు.

విశాఖలో ముగింపు మాటేది?

విశాఖలో ముగింపు ఉత్సవాలకు రెండు నుంచి మూడు కోట్లు అదనంగా ఖర్చు చేశారని అఖిలప్రియ, గౌతు శిరీష వివరించారు. ముగింపు కార్యక్రమానికి అప్పటి సీఎం జగన్ రాలేదన్నారు. లేజర్ షోలు, ఫారెన్ నుంచి ఆర్టిస్టులు, ప్రైవేటు సెక్యూరిటీని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ప్రభుత్వ కార్యక్రమానికి ప్రైవేటు సెక్యూరిటీ ఎందుకు ఏర్పాటు చేశారని ప్రశ్నించారు.గ్రామ సచివాలయాలు 15,000 పార్టిసిపేట్ చేయగా, 35 లక్షల మంది ప్రేక్షకులు వచ్చినట్టు నివేదికలో ఉందన్నారు. 753 మండలాలు పాల్గొనగా దాదాపు 4 లక్షల మంది

# పట్టుదలతో సాధ్యమే!



హైదరాబాద్,ఎండాకాలంపరీక్షల కాలం కట్టకట్టుకుని ఒకేసారి వస్తాయి. ఎండాకాలం అంటే ఉష్ణోగ్రతలు పెరిగే కాలం. పరీక్షల కాలం అంటే ఒత్తిడి పెరిగే సమయం. వీటితో విద్యార్థులు శారీరకంగా, మానసికంగా పెద్ద సవాళ్లను ఎదుర్కొంటారు. మార్చి 15తో ఇంటర్ పరీక్షలు ముగియనుండగా, 17 నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభమై ఈనెల చివరివరకూ కొనసాగుతాయి. పరీక్షలు విద్యార్థుల జీవితంలో ఒక ముఖ్యమైన భాగం. అయితే, ఈ రోజుల్లో పరీక్షలు విద్యార్థులపై అత్యధిక ఒత్తిడిని కలిగిస్తున్నాయి. పరీక్షా ఫలితాలు వారి భవిష్యత్‌ను నిర్ణయిస్తాయన్న భావన వల్ల విద్యార్థులు తీవ్రమైన మానసిక ఒత్తిడిని అనుభవిస్తున్నారు. ఈ ఒత్తిడి వల్ల కొందరు విద్యార్థులు మానసిక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. సమాజంలో వున్న పోటీ భావన, ఇంట్లో తల్లిదండ్రులు, స్కూల్లో టీచర్ల అధిక అంచనాలు ఒత్తిడికి గురిచేస్తున్నాయి. అయితే, సరైన ప్రణాళిక, సమర్థవంతమైన అధ్యయనం, ఆరోగ్య సంరక్షణ ద్వారా ఈ కాలాన్ని సులభంగా ఎదుర్కోవచ్చు. జీవితంలో విజయం సాధించడానికి క్రమశిక్షణ, శ్రమ, ఆత్మవిశ్వాసం అవసరం. మార్కులు తక్కువ వచ్చినవారు, తరగతి గదిలో మొద్దబ్బాయిలుగా ముద్ర పడినవారుజీవితంలో గొప్ప విజయాలు సాధించిన ఉదాహరణలు అనేకం వున్నాయి. విద్య యొక్క వేర్లు చేదుగా వుంటాయి. కానీ, దాని ఫలాలు తీపిగా వుంటాయి.ఈసారి మార్చి మొదటివారం నుంచే ఎండలు, వడగాడ్పుల తీవ్రత కూడా ఎక్కువగానే వుంటుందని నిపుణులు చెబుతున్నారు. వెంటిలేషన్ లేని గదులు, రేకుల షెడ్లలో పరీక్షలు రాసే విద్యార్థులు అప్రమత్తంగా వుండాలని, ఏమాత్రం అజాగ్రత్త వహించినా వడదెబ్బ బారిన పడే ప్రమాదం వుందని చెబుతున్నారు. దీనికితోడు పిల్లలు%ౌ% ఏం చదవాలి? ఎలా చదవాలి? అన్న టెన్షన్‌తో సరిగ్గా తినలేరు, నిద్రపోలేరు. ఆ తర్వాత కూడా పాస్ అవుతామో, ఫెయిల్ అవుతామోనన్న భయం వారిని వెంటాడుతుంటుంది. తమ పిల్లలు ఉన్నత చదువులు చదివి, పెద్దపెద్ద ఉద్యోగాలలో స్థిరపడాలని, తాము సాధించలేనిది తమ పిల్లల ద్వారా సాధించాలని కలలుగంటారు తల్లిదండ్రులు. వారి ఆశలను, ఉపాధ్యాయులు మెడకు తగిలించే ర్యాంకుల గుదిబండను మోయలేక, వాటిని నెరవేర్చుతామో లేదోనన్న ఆత్మన్యూనతా భావంతో, క్షణికావేశంలో బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. 'చదువురాని వాడినని దిగులు చెందకు/ ఏమి చదివి పక్షులు పైకెగర గలిగెను/ ఏ చదువు వల్ల చేపపిల్ల ఈద గలిగెను' అంటారో కవి. కార్పొరేట్ స్కూళ్ల ర్యాంకుల మాయాజాలంలో కొట్టుకుపోకుండా%ౌ% తమ బిడ్డల ఆసక్తిని గుర్తించి, ప్రోత్సహించాలి. ఎవరో ఏదో చేశారని, మనవాడూ అదే చెయ్యాలన్న అతి అంచనాలకు పోతే, బిడ్డలపై శక్తికి మించిన భారం మోపినట్లవుతుంది.అదే సమయంలో పరీక్షలకు భయపడాల్సిన పనిలేదు. పరీక్షలు, మార్కులు మాత్రమే మనిషి జీవితాన్ని నిర్ణయించవు. అవి జ్ఞానానికి ఒక అంచనా మాత్రమే. శక్తి మేరకు కృషి చేయడం ముఖ్యం. ప్రతి విజయం-ప్రయత్నించాలనే నిర్ణయంతోనే మొదలవుతుంది. విజయం రాత్రికి రాత్రే లభించదు. 'విజయం సాధించడమే అంతిమం కాదు, వైఫల్యం ప్రాణాంతకం కాదు%ౌ% కొనసాగించాలనే పట్టుదలే ముఖ్యం' అంటారు విన్‌స్టన్ చర్చిల్. విద్యార్థులు ర్యాంకులు తెచ్చే యంత్రాలు కాదు. పోటీతత్వం వారిని యాంత్రికంగా మార్చేస్తోంది. చదువొక్కటే కాదు%ౌ% ఆటపాటలతో పాటు ఉల్లాసంగా, ఉత్సాహంగా పెరిగే వాతావరణం కూడా అవసరం. 'మనసు నింపాల్సిన పాత్ర కాదు%ౌ% రగిలింపజేయాల్సిన నిప్పు' అంటారో కవి. ఇవాళ ఓడినా%ౌ% రేపు గెలుస్తామన్న ఆశను మనసులో రగిలించాలి. అది తమ లక్ష్యం కోసం నిరంతరం శ్రమించేలా, పరితపించేలా చేస్తుంది. ఒకవేళ పరీక్షలలో ఫెయిల్ అయినానిరుత్సాహపడాల్సిన పనిలేదు. వారికి ఆసక్తి వున్న రంగంలో ప్రోత్సహించాలి. ప్రపంచంలోని ఏ మారుమూలనున్న ఇంట్లోనైనా రాత్రవగానే స్విచ్ వేస్తేఎలక్ట్రిక్ బల్బు వెలుగులు విరజిమ్ముతుంది. చిన్నతనంలో మొద్దబ్బాయిగా ముద్రపడి, ఆ తర్వాత గొప్ప శాస్త్రవేత్తగా ఎదిగిన థామస్ ఆల్వా ఎడిసన్ ఆ బల్బును కనుగొన్నారు. ప్రతి ఒక్కరిలోనూ నిగూఢంగా గొప్ప శక్తి దాగివుంటుంది. దాన్ని గుర్తించి, వెలికితీయగలిగితేప్రతి విద్యార్థీ ఒక ఎడిసన్‌లా ఉన్నత శిఖరాలకు ఎదుగుతారు.

# జనసేన ఆవిర్భావానికి భారీగా ఏర్పాట్లు

కాకినాడ,ఈ నెల 14వ తేదీన సాయంత్రం 4 గంటలకు జనసేన ఆవిర్భావ దినోత్సవ సభ ప్రారంభం అవుతుందని నాదెండ్ల మనోహర్ అన్నారు .. భాష, సంస్కృతిని గౌరవించుకునేలా సభ జరుగుతుంది..

సభ పూర్తయిన తర్వాత పారిశుద్ధ్యం భాద్యత కూడా మేమే తీసుకుంటాం.. భారత దేశంలో ఏ పార్టీ కూడా ఈ విధంగా పర్యావరణం కూడా ఆలోచించి ఉండదన్నారు జనసేన పీఏసీ చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్.. కాగా, జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈ సారి పిఠాపురం వేదికగా నిర్వహించేందుకు జనసేన పార్టీ ఏర్పాట్లు పూర్తి చేస్తోంది.. కూటమి ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా మారడం.. పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం కావడం.. కీలక శాఖలను జనసేన దక్కించుకున్న తర్వాత.. జరుగుతోన్న తొలి ఆవార్భావోత్సవం కాబట్టి.. ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేయడానికి జనసేన పార్టీ కసరత్తు చేస్తోంది .. ఈ సభా వేదికగా పార్టీ శ్రేణులకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేయనున్నారు.. పిఠాపురం పవన్ కల్యాణ్ అడ్డా అని మంత్రి నాదెండ్ల మనోహన్ అన్నారు. జనసేన ఆవిర్భావోత్సవానికి పిఠాపురం సిద్ధమవుతోన్న వేళ.. ఓవైపు జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. మరోవైపు.. టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే వర్మపై కీలక వ్యాఖ్యలు చేశారు.. వర్మ చాలా సీనియర్ పొలిటీషియన్.. వాళ్ల పార్టీ.. ఆయన విషయంలో నిర్ణయం తీసుకుంటుంది, అది ఆ పార్టీ అంతర్గత వ్యవహారమని స్పష్టం చేశారు.. వర్మని గౌరవించడంలో మాకు ఎటువంటి అభ్యంతరం లేదన్న ఆయన.. వర్మకి చెక్ పెట్టాల్సిన అవసరం మాకు ఏమి ఉంటుందని ప్రశ్నించారు. ఇక, పవన్ కల్యాణ్ సెక్యూరిటీ విషయంలో డిపార్ట్‌మెంట్‌తో పాటు పార్టీ పరంగా మేం కూడా చూసుకుంటాం.. సభా ప్రాంగణంలో 75 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం.. పిఠాపురం ప్రజలకి కృతజ్ఞతలు చెప్పడానికి ఈ సభ ఏర్పాటు చేశాం అన్నారు..

# కుదరని రాజకీయం

అనంతపురం:ఉమ్మడి అనంతపురం జిల్లాలో కేతిరెడ్ల రాజకీయం పారడంలేదు. వైసీపీ అధికారంలో ఉన్న రోజులలో ఒక వెలుగు వెలిగి హవా చాటుకున్న కేతిరెడ్డి బాబాయ్ అబ్బాయిలకు ఇపుడు అంతా రివర్స్ లో సాగుతోంది. కేతిరెడ్డి పెద్దారెడ్డి బాబాయ్ అయితే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి అబ్బాయి. ఈ ఇద్దరూ వైసీపీలో ఎంతో కీలకంగా ఉండేవారు.కేతిరెడ్డి పెద్దారెడ్డి జేసీ బ్రదర్స్ లా ఇలాకా అయిన తాడిపత్రిలో 2019లో గెలిచారు. తాడిపత్రిలో జేసీలను ఓడింబ్చి జెయింట్ కిల్లర్ గా మారారు. వైసీపీ అధికారంలోకి రావడంతో ఆయన దూకుడు వేరే లెవెల్ లో సాగింది. ఎంతలా అంటే జేసీ ప్రభాకర్ రెడ్డి ఇంటికి వెళ్ళి మరీ అక్కడ ఆయన చేసిన హడావుడి అప్పట్లో రాజకీయ రచ్చకు దారి తీసింది. అయితే చేతిలో అధికారం ఉంది కాబట్టి అంతా చెల్లుబాటు అయింది.అయితే 2024లో అధికారం పోగానే పెద్దారెడ్డికి కష్టాలు మొదలయ్యాయి. ఆయనను తాడిపత్రి నుంచి దూరం పెట్టడంలో జేసీ ఫ్యామిలీ విజయం సాధించారు. అటు పెద్దారెడ్డి ఇటు జేసీల ఫ్యామిల మధ్య రాజకీయ కక్షలు కార్పణ్యాలతో తాడిపత్రి మండిపోతోంది అని కొన్నాళ్ళ పాటు ఎవరూ తాడిపత్రిలోకి అడుగుపెట్టవద్దు అని పోలీసులు ఆదేశించారు.అయితే కొన్నాళ్ళ తరువాత జేసీ ఫ్యామిలీకి మినహాయింపు ఇచ్చారు. దాంతో ఎమ్మెల్యే హోదాలో అస్మిత్ రెడ్డి అలాగే తాడిపత్రి చైర్మన్ గా జేసీ ప్రభాకర్ రెడ్డి తమ సొంత ఇలాకాలో బాగానే తిరుగుతున్నారు. కానీ పెద్దారెడ్డి మీద పెట్టిన ఆంక్షలు అలాగే ఉండిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ తొమ్మిది నెలల కాలంలో పెద్దారెడ్డి తన సొంత నియోజకవర్గంలోకి అడుగు పెట్టలేకపోయారు.ఆయన ఎంతలా రావాలని చూస్తున్నా పోలీసులు అనుమతి ఇవ్వడంలేదు. దాంతో ఆయన నియోజకవర్గానికి దూరం అయిపోయారు. ఇక అబ్బాయి కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి విషయం తీసుకుంటే ఆయన ధర్మవరం నుంచి గెలిచారు. ఆయన వైసీపీ అధికారంలో ఉన్న అయిదేళ్ళ కాలంలో గుడ్ మార్నింగ్ ధర్మవరం పేరుతో కార్యక్రమం చేపట్టి జనంతో మమేకం అయ్యారు. ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తూ వారికి బాగా చేరువ అయ్యారు.నిజానికి ఆయన అంతలా తిరిగిన దానికి రికార్డు మెజారిటీతో గెలవాలి. కానీ ధర్మవరానికి పొత్తులో భాగంగా వచ్చి పోటీ చేసిన బీజేపీ నేత సత్యకుమార్ యాదవ్ కి జనం పట్టం కట్టారు. దీంతో తీవ్రమైన వేదనకు వెంకట్రామిరెడ్డి గురి అయ్యారు. తాను ఎంతగానో ప్రజలకు సేవ చేస్తే తనను కాదని ఎన్నికల ముందు వచ్చిన వారిని జనాలు గెలిపిస్తారా అని మనో వేదనకు గురి అయి ఏకంగా నియోజకవర్గానికే దూరంగా ఉంటున్నారు.ఆయన ఫేస్ బుక్ ల ద్వారా లేదా సోషల్ మీడియా ద్వారానే తన భావాలను అప్పుడప్పుడు వ్యక్తం చేస్తూ వస్తున్నారు. అంతే తప్ప ధర్మవరంలో మాత్రం కనిపించడం లేదు.

# నాదెండ్ల హాట్ కామెంట్స్...టీడీపీ తట్టుకోగలదా ?



అమరావతి,రాజకీయాల్లో ఎవరు పెద్ద ఎవరు చిన్న అన్నది ఉండదు. పరిస్థితులు అవకాశాలే ఎపుడూ పెద్ద. అలాగే వ్యూహాలే ఎపుడూ విజయాలు అందిస్తాయి. ఆ విధంగా చూస్తే 2024లో టీడీపీ కూటమి ఏపీలో అధికారంలోకి రావడానికి కారణం ఎవరు అంటే అనేక అంశాలు దీని వెనక బలంగా పనిచేశాయి. అందులో పవన్ కళ్యాణ్ ఫ్యాక్టర్ కూడా ఒకటి అని విశ్లేషణలు ఉన్నాయి.అదే సమయంలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అండదండలు కూడా అతి ముఖ్యంగా సహకరించాయి. అలాగే యాభై ఏళ్ళ రాజకీయ అనుభవం కలిగిన దిగ్గజ నేత చంద్రబాబు చాణక్య రాజకీయం కూడా చాలా బలంగా పనిచేసింది. ఇలా ప్రతీ అంశమూ కూడా కూటమి విజయం వెనక ఉంది.అయితే క్రెడిట్ ని ఎవరు తీసుకోవాలీ అంటే సమిష్టిగానే అని చెప్పాలి. ఇక్కడే ఎవరి వాదనలు వారికి ఉంటాయనిపిస్తుంది. జనసేన విషయం తీసుకుంటే ఆ పార్టీ అధినేత పవన్ కి విపరీతమైన గ్లామర్ ఉంది. ఆయన వెనక బలమైన సామాజిక వర్గం ఉంది. యువత మహిళాలలో విశేషంగా క్రేజ్ ఉంది.దాంతో పవన్ ఫ్యాక్టర్ బ్రహ్మాండంగా పనిచేసింది అని చెప్పాలి. ఇక కూటమి కట్టాలని 2022 నుంచే పవన్ చెబుతూ వచ్చారు. ఆ విషయంలో ఆయన తుదివరకూ పట్టుదల పట్టారు. తనకు కేటాయించిన 24 ఎమ్మెల్యే సీట్లను 21కి కుదిరించున్నారు. అలాగే అనకాపల్లి ఎంపీ టికెట్ తన సొంత అన్నకు ఇచ్చినా కూడా వెనక్కి తీసుకుని బీజేపీకి వచ్చేలా చూశారు.ఇలా పవన్ ఫ్యాక్టర్ ఈ ఎన్నికల్లో విజయానికి ఎంతో ఉపయోగపడింది అని చెప్పాలి. అయితే అదే సమయంలో తెలుగుదేశం పార్టీ బూత్ లెవెల్ దాకా బలంగా ఉంది. ఎంత గ్లామర్ ఉన్నా మరెంత పట్టుదల ఉన్నా పార్టీ కూడా పటిష్టంగా ఉంటేనే సాధ్యపడతాయి. అందువల్ల చూసుకుంటే టీడీపీ ఏపీలో అత్యంత బలమైన పార్టీ. సుశిక్షితులైన పార్టీ క్యాడర్ బలంగా ఉంది.అంతే కాదు అంకితభావంతో పనిచేసే క్యాడర్ టీడీపీ సొంతం. ఇక పొత్తులు ఎత్తుల విషయంలో బాగా పండిపోయిన చంద్రబాబు చాకచక్యం కూడా ఎంతగానో ఉపకరించింది అని చెప్పాలి. ఆశావహులు ఎంతో మంది ఉన్నా అందరినీ కూర్చోబెట్టి బుజ్జగించి దారికి తెచ్చుకోవడంలో బాబుకే క్రెడిట్ ఇవ్వాలి. అలాగే కేంద్రం సాయం అందించినా దానికి ఎపుడు ఎక్కడెక్కడా వాడాలి అన్ని పూర్తిగా తెలిసిన వారుగా బాబుని చూడాలిఈ విధంగా అందరూ కలసిన మీదటనే కూటమి ఘన విజయం సాధించింది అని చెప్పవచ్చు. అయితే ఇటీవల కాలంలో పిఠాపురం పీటముడి పడి టీడీపీ జనసేనల మధ్య సంబంధాలను కొంచెం ఇబ్బంది పెడుతోంది. తాను చంద్రబాబు మాట మీద పనిచేశాను త్యాగం చేశాను తనకు తగిన పదవి దక్కలేదని వర్మ తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో పిఠాపురం టీడీపీ నేతలు అంతా వర్మకు పదవి దక్కకపోవడం అంతా జనసేన స్కెచ్ అని ఆడిపోసుకుంటున్నారు.ఈ క్రమంలో పిఠాపురంలోని ఈ రాజకీయ మంటలు కాస్తా ఏకంగా ఏపీలో చంద్రబాబు దాకా వెళ్తున్నాయి. జనసేనలో నంబర్ టూగా ఉన్న నాదెండ్ల మనోహర్ అయితే పార్టీ క్యాడర్ మీటింగులో మాట్లాడుతూ పవన్ లేకపోతే కూటమికి అధికారం లేదు, చంద్రబాబు సీఎం కూడా అయింది పవన్ పట్టుదల వల్లనే అని హాట్ కామెంట్స్ చేశారు. పవన్ ఎంతో తగ్గి వ్యవహరించారని అందరినీ కలుపుకున్నారని, పొత్తుల విషయంలో ఎంతో ఆలోచించారని నాదెండ్ల చెప్పారు.ఇదంతా దేనికి అంటే ఒక్క ఎమ్మెల్సీ సీటు కోసం జనసేన మీద లోకల్ టీడీపీ నేతలు విమర్శలు చేస్తూండడంతో జనసేన నేతలు కూడా మేము లేకపోతే మీ అధినేతకే అధికారం ఎక్కడిది అన్నంతగా ప్రతి విమర్శలు చేస్తున్నారు. ఇది కాస్తా చిలికి చిలికి పెను వివాదంగా మారుతోంది. దీనికి ఎక్కడో ఒక చోట ఫుల్ స్టాప్ పెట్టాల్సి ఉంది అని అంటున్నారు.మరో వైపు చూస్తే పవన్ వల్లనే పవర్ అని సీఎం కుర్చీ బాబుకు దక్కిందని జనసేన నేతలు బాహాటంగా అనడాన్ని టీడీపీ హార్డ్ కోర్ ఫ్యాన్స్ ఎంతవరకూ జీర్ణించుకుంటారు అన్నది కూడా చర్చగా ఉంది. పై స్థాయిలో అయితే లోలోపల బాధపడతారు కానీ దిగువ స్థాయిలో ఇది మరింతగా కాక పుట్టించే అంశం అవుతుందని అంటున్నారు.

# సరిహద్దుల్లో స్పెషల్ ఫోకస్!

ఆదిలాబాద్, మహారాష్ట్రకు ఆనుకొని ఉన్న ఆదిలాబాద్ జిల్లా సరిహద్దుల్లో నిఘా ముమ్మరం చేసి గంజాయితోపాటు మాదకద్రవ్యాల నియంత్రణపై ఉక్కు పాదం మోపుతామని ఆదిలాబాద్ జిల్లా నూతన ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం సిరిసిల్ల జిల్లా నుండి బదిలీపై వచ్చిన నూతన ఎస్పీ అఖిల్ మహాజన్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించి ఆదిలాబాద్ ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. సరిహద్దుల్లో చెక్ పోస్టుల వద్ద నిఘా మరింత ముమ్మరం చేసి గంజాయి రవాణా కు కళ్లెం వేస్తామని, అసాఘిక కార్యకలాపాలను నియంత్రిస్తామని స్పష్టం చేశారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణ

ఆదిలాబాద్ ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించి ప్రజలకు ఇబ్బందులు దూరం చేస్తామని ఎస్పీ అన్నారు. రౌడీ షీటర్ల ఆగడాలు సహించేది లేదని స్పష్టం చేశారు. నూతన ఆలోచనలు, పోలీసు సంస్కరణలను పకడ్బందీగా అమలు చేసి ప్రజలకు మరింత చేరువ అవుతామన్నారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ గా బదిలీపై వెళ్తున్న ఎస్పీ గౌస్ అల%శీ% కు పోలీసులు అధికారులు, వీడుకోలు పలికారు. గౌస్ అలం ఏడాది కాలంలో చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. జిల్లా వ్యాప్తంగా క్రిమినల్ యాక్టివిటీస్ లేకుండా నేరాలను నియంత్రించడం, శాంతి



భద్రతల పరిరక్షణకు పకడ్బందీచర్యలు తీసుకుంటామన్నారు. తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీకి అదనపు ఎస్పీ బి సురేందర్రావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్ జీవన్ రెడ్డి, సిహెచ్ నాగేందర్, హసీబుల్లా, ఇన్స్పెక్టర్లు సునీల్ రావు, కరుణాకర్, శ్రీనివాస్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ తోట మల్లేష్ , పోలీసు సిబ్బంది స్వాగతం పలికారు.

# ఎపి విభజన చట్టం మేరకు సీట్లు పెంచాల్సిందే




న్యూఢిల్లీ,ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం–2014 ప్రకారం.. ఏపీ శాసనసభ స్థానాలను 175 నుంచి 225కు, తెలంగాణ అసెంబ్లీ స్థానాలను 119 నుంచి 153కు పెంచాల్సి ఉంది. ఈ మేరకు అప్పటి మన్మోహన్ సింగ్ ప్రభుత్వం హామీ కూడా ఇచ్చింది. అయితే విభజన హామీలన్నీ గాలికి పోయాయి.ఈ క్రమంలో ఇప్పుడు నియోజకవర్గాల పునర్విభజన కమిషన్ విభజన చట్టాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉన్నది. నియోజకవర్గాల పునర్విభజన సమగ్రంగా జరగాలంటే జనాభాతో పాటు అభివృద్ధి సూచికలు, ప్రాంతాల సరిహద్దులను కూడా తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలి. నియోజక వర్గాల పునర్విభజన చేస్తే అన్ని ప్రాంతాలు, వర్గాల అభిప్రాయాలు తీసుకుంటే మంచిది. అయితే జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తే తమకు అన్యాయం జరుగుతుందని దక్షిణాది రాష్ట్రాలు గగ్గోలు పెడుతు న్నాయి. 1973లో వివిధ రాష్ట్రాలకు ఏ నిష్పత్తి ప్రకారం సీట్లను కేటాయించారో ఆ విధంగానే ఇప్పుడు కూడా అలాంటి నియమాలు, నిబంధనలను పాటించాలని కోరుకుంటున్నాయి. ఒకవేళ లోక్‌సభ సీట్లు పెంచాల్సివచ్చినా అదే నిష్పత్తితో అన్ని రాష్ట్రాలకు సమంగా వర్తింప చేయాలని కూడా అంటున్నాయి. జనగణన పూర్తయిన వెంటనే నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను చేపట్టాలి. లోక్‌సభ, శాసనసభల సీట్లకు సంబంధించి గ్రామీణ, నగర ప్రాంతాలను దృష్టిలో పెట్టుకోవాలి. నియోజకవర్గాల పునర్విభజన జరిగి, అందరికీ సమాన ప్రాతినిధ్యం కల్పించాలని సూచిస్తున్నాయి. అందుకు అనుగుణంగా ఇప్పటి నుంచే కేంద్రంలోని మోదీ సర్కార్ జాతీయ, ప్రాంతీయ పార్టీలతో సమాలోచనలు జరిపి వారి అభిప్రాయాలు కూడా తీసుకుంటే మంచిది. 1951 జనగణన లెక్కల ఆధారంగా మొదటిసారి డీలిమిటేషన్ ప్రక్రియ జరిగింది. దేశంలో ఎన్నికల వ్యవస్థకు స్పష్టమైన రూపం తీసుకొచ్చేందుకుగాను మొదటి విడత కసరత్తు జరిగింది. ఆ తర్వాత 1961 జనగణన లెక్కల ఆధారంగా రెండోసారి డీలిమిటేషన్ ప్రక్రియ జరిగింది. తద్వారా స్వాతంత్ర్యానంతరం మొదటి దశాబ్దంలో పెరిగిన జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాలకు మరింత కచ్చితమైన రూపం తీసుకొచ్చారు. రెండో విడత నియోజకవర్గాల పునర్విభజన ద్వారా లోక్‌సభ స్థానాలను 494 నుంచి 522కు పెంచారు. అలాగే దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల శాసనసభల స్థానాలను 3,771గా నిర్ణయించారు. ఆ తర్వాత 1971 జనగణన ఆధారంగా 1973లో మూడో విడత నియోజకవర్గాల పునర్విభజన చేపట్టారు. ఈసారి లోక్‌సభ స్థానాలను 522 నుంచి 543కి పెంచి, అసెంబ్లీల స్థానాలను 3771 నుంచి 3,997గా ఖరారు చేశారు. అంతేకాకుండా 2001 వరకు లోక్‌సభ స్థానాలను యథాతథంగా ఉంచాలని 42వ రాజ్యాంగ సవరణ ద్వారా చేశారు. మళ్లీ మూడు దశాబ్దాల తర్వాత 2001 జనాభా లెక్కల ఆధారంగా 2002 డీలిమిటేషన్ చట్టాన్ని తీసుకొచ్చారు. కానీ, లోక్‌సభ స్థానాల సరిహద్దులను మాత్రమే మార్చి, సీట్ల సంఖ్యను మాత్రం యథాతథంగా కొనసాగించారు. అంతేకాదు, 2026 వరకు డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టకూడదని కూడా నిర్ణయించారు. కొత్త రాష్ట్రాలు ఏర్పడినందున అసెంబ్లీ స్థానాలను మాత్రం 4,123కి పెంచారు. అలాగే 1971 జనగణన ఆధారంగా చేపట్టిన పునర్విభజనతో నిర్ణయించిన లోక్‌సభ సీట్ల సంఖ్య 2026 తర్వాత మొదటిసారి జరిగే జనగణన వరకు యథాతథంగా ఉండాలని 84వ రాజ్యాంగ సవరణ ద్వారా నిర్ణయించారు. ఇప్పుడు జనాభా ఆధారంగా లోక్‌సభ సీట్లు పెంచితే దక్షిణాది రాష్ట్రాల్లో తక్కువ సంఖ్యలో, ఉత్తరాది రాష్ట్రాల్లో ఎక్కువ సంఖ్యలో సీట్లు పెరిగే అవకాశం ఉన్నది. 2026లో జరిగే నియోజకవర్గాల పునర్విభజనలో ఈ అంశం వివాదాస్పదంగా మారే సూచనలూ కన్పిస్తున్నాయి. ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాలకు చెందిన అనేక మంది రాజకీయ నాయకులు ఈ అంశంపై గళమెత్తుతున్నారు. 1973లో జరిగిన పునర్విభజన తరహాలోనే రాష్ట్రాలకు లోక్‌సభ సీట్ల సంఖ్యను కేటాయించాలని వారు వాదిస్తున్నారు.

# జనగణనతో తేలనున్న అసలు జనాభా

న్యూఢిల్లీ,మన దేశంలో చివరిసారిగా 2011లో జనగణన జరిగింది. మళ్లీ 2021లో జనగణన జరగాల్సి ఉండగా, కరోనా కారణంగా వాయిదా పడింది. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం నిర్ణయం ప్రకారం 2025 మొదటి త్రైమాసికంలో జనగణన ప్రారంభం కానున్నది. అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతికత, డిజిటల్ గవర్నెన్స్ వల్ల ఏడాదిలోగా ప్రక్రియ సమర్థవంతంగా పూర్తవుతుందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. సకాలంలో జనగణన పూర్తయితే దేశంలో జనాభా సంఖ్య తేలనుంది. అందులో స్త్రీపురుష జనాభా వివరాలు వస్తాయి. దీని ఆధారంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాల్సి ఉంటుంది. దీంతోపాటే నియోజకవర్గాల పునర్విభజనకు కూడా మార్గం సుగమం అవుతుందని రాజకీయ పార్టీల ఆశగా ఉంది. ఎలాగూ జనగణన తప్పదు కనుక అనేక కీలక అంశాలపైనా శాశ్వత నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. దేశం ఎదుర్కొంటున్న సవాళ్లను దృష్టిలో పెట్టుకుని అవసరమైన మేరకు రాజ్యాంగ సవరణలను ఆమోదించుకోవాలి. ఒకేదేశం ఒకేచట్టం ఇందులో ప్రధాన మైనది. జనాభా నియంత్రణ కూడా అంతే ప్రధానమైనది. వనరులు తగ్గిపోతున్న క్రమంలో జనాభా నియంత్రణ లేకుండా సాగితే దేశంలో అరాచకం ప్రబలే ఆస్కారం ఉంది. దీనిని గమనించి కేంద్రం చర్యలు తీసుకుంటే మంచిది.అలాగే కాంగ్రెస్ పార్టీ కులగణనతో దేశంలో విభజన రాజకీయాలు చేస్తోంది. దీనిపైనా స్పష్టత రావాల్సి ఉంది. కులాలను పక్కన పెట్టేలా కఠిన రాజ్యాంగ చర్యలకు ఉపక్రమించాలి. కులాల పేరుతో దేశాన్ని చీల్చే ప్రక్రియ సరైనది కాదు. ఆధునిక సమాజంలో ఇంకా కులాలను పట్టుకుని వేళ్లాడడం కూడా అంతమంచిది కాదు. ప్రజల్లో ఆడా,మగా, ఉన్నవారు, లేని వారు అన్న విభజన రేఖలు మాత్రమే ఉండాలి. వాటి ఆధారంగానే అన్ని రకాల ప్రయోజనాలు, కార్యక్రమాలు అమలు కావాలి. మొత్తంగా పదేళ్లుగా ఈ అంశాలపై ఊరిస్తూ వచ్చిన మోడీ ఇప్పటికైనా కఠిన నిర్ణయాలతో ముందుకు సాగితేనే దేశంలో అలజడి లేకుండా ప్రశాంతంగా



సాగగలదు. జనాభ నియంత్రణ కేవలం హిందువులకే అన్న పద్దతిలో సాగడం మంచిపద్దతి కాదు. ఇకపోతే జమిలి ఎన్నికలకు ముందే జనాభా గణన చేపట్టాలి. దేశంలో ఆరోవేలుగా ఉన్న గవర్నర్ వ్యవస్థలను రద్దు చేయాలి. పంచాయితీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయాలి. ఎంపిటిసిలు, జడ్పీటీసీల వ్యవస్థలను ఎత్తేయాలి. పంచాయితీలకే గ్రామాల అభివృద్ధి బాధ్యతను చట్టబద్దంగా అప్పగించాలి. కేంద్రం నిధులు విడుదల చేస్తున్నా..అవి సక్రమంగా వినయోగించడం లేదు. దీంతో గ్రామాలు ఏమాత్రం అభివృద్ధి చెందకుండా వట్టి పోతున్నాయి. ఇకపోతే వచ్చే ఏడాది జనగణన ప్రక్రియను చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పలు అంశాలు తెరపైకి వస్తున్నాయి. అందు లో ఒకటి మహిళా రిజర్వేషన్ చట్టం కాగా, రెండోది లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశం. వీటిపై స్పష్ట రావాల్సి ఉంది. ఈ పార్లమెంట్ సమావేశాల్లో వీటిపై చర్చకు బిజెపి సిద్దంగా ఉందా లేదా అన్నది ముఖ్యం.

# కూటమి కోటాలో సోముకు ఎమ్మెల్సీ.. రగిలిపోతున్న తెలుగుదేశం శ్రేణులు



అమరావతి,ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీకి అవకాశం లభిస్తుందని భావించిన ఇద్దరు తెలుగుదేశం నేతలకు తీవ్ర నిరాశ మిగిలింది. వారిలో ఒకరు పిఠాపురం వర్మ కాగా మరొకరు పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమ. వీరిరువురూ కూడా ఎమ్మెల్సీ స్థానాన్ని ఆశించారు. ఆశించారనడం కంటే పార్టీ అధిష్ఠానమే వారికి ఎమ్మెల్సీ హామీ ఇచ్చింది. అయితే కారణాలేమైనా తెలుగుదేశం అధిష్ఠానం వీరిద్దరినీ పక్కన పెట్టింది. ఐదు స్థానాలకు ఎన్నికలు జరగనుండగా, వాటిలో ఒక స్థానాన్ని జనసేనకు కేటాయించడం పట్ల తెలుగుదేశంలో ఎవరి నుంచీ ఎటువంటి అభ్యంతరం వ్యక్తం కాలేదు. కానీ బీజేపీకి ఒక స్థానం కేటాయించడం పట్ల క్యాడర్ లోనే కాకుండా.. పార్టీ నేతలలో కూడా అభ్యంతరం, అసహనం వ్యక్తం చేస్తున్నది.బీజేపీ కోసం ప్రతి సారీ తెలుగుదేశం పార్టీయే ఎందుకు త్యాగాలు చేయాలన్న ప్రశ్న కూడా గట్టిగా వినవస్తున్నది. గతంలో ఆర్ కృష్ణయ్య విషయంలోనూ ఇదే పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు ఎమ్మెల్సీ విషయంలోనూ బీజేపీ పట్టుబట్టి ఒక స్థానాన్ని తెలుగుదేశం నుంచి లాగేసుకుందన్న అభిప్రాయం తెలుగుదేశం శ్రేణుల్లో వ్యక్తం అవుతోంది. అదే విధంగా ఇటీవల విజయసాయిరెడ్డి తన రాజ్యసభ స్థానానికి రాజీనామా చేయడంతో ఏర్పడిన ఖాళీని కూడా బీజేపీ అభ్యర్థితోనే భర్తీ చేయాలని ఆ పార్టీ పట్టుబడుతున్నట్లుగా తెలుగుదేశం వర్గాలలో వినిపిస్తోంది. అది పక్కన పెడితే..ప్రస్తుతం ఒక ఎమ్మెల్సీ స్థానాన్ని తెలుగుదేశం బీజేపీ కోసం త్యాగం చేయడం వల్ల పార్టీ ప్రతిపక్షంలో ఉండగా త్యాగాలు చేసి, పోరాటాలు చేసిన నేతలకు అవకాశం దక్కకుండా పోతున్నది. వారిలో ప్రధానంగా పిఠాపురం వర్మ, దేవినేని ఉమ ఉన్నారు. గత ఎన్నికలలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ కోసం తన సీటును త్యాగం చేసిన పిఠాపురం వర్మకు పార్టీ అధినేత ఎమ్మెల్సీ టికెట్ హామీ ఇచ్చినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అదే విధంగా పొత్తు ధర్మంతో సీటు త్యాగం చేసిన దేవినేని ఉమకూ దాదాపు ఇలాంటి హామీయే దక్కింది. అయితే ఇప్పుడు ఆ ఇద్దరికీ కూడా తెలుగుదేశం ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీకి అవకాశం ఇవ్వలేదు. దీంతో పిఠాపురం వర్మ ఓపెన్ అయిపోయారంటున్నారు. తన సన్నిహితుల వద్ద పార్టీ కోసం త్యాగాలు చేసి తప్పు చేశానని, త్యాగం చేసిన తనకు తగిన శాస్తే జరిగిందనీ వ్యాఖ్యానించినట్లు చెబుతున్నారు. అయితే తరువాత మీడియా సమావేశంలో పార్టీ నిర్ణయమే శిరోధ్యర్యం అని ప్రకటించారనుకోండి అది వేరే సంగతి. ఇక దేవినేని ఉమ బహిరంగంగా తన అసంతృప్తిని వ్యక్తం చేయనప్పటికీ, తనకు ఎమ్మెల్సీ అవకాశం దక్కకపోవడం పట్ల ఆయన నిరాశకు గురైనట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వాస్తవానికి బీజేపీలో ఎమ్మెల్సీ స్థానానికి తగిన నేత లేరనే చెప్పాలి. జగన్ అధికారంలో ఉన్నన్నాళ్లూ ఆ పార్టీతో అంటకాగిన సోము వీర్రాజుకు ఇప్పుడు బీజేపీ ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వడం తెలుగుదేశం శ్రేణులలో అసంతృప్తినీ, ఆగ్రహాన్నీ కలిగిస్తున్నది. నిజానికి బీజేపీ తెలుగుదేశం, జనసేన పార్టీలతో పొత్తు కారణంగా ఇప్పటికే తనకు ఉన్న స్టేక్ కంటే ఎక్కువ లాభం పొందింది. ఇదే పరిస్థితి ముందుముందు కూడా కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయని పరిశీలకులు సైతం విశ్లేషిస్తున్నారు. వచ్చే ఐదేళ్ల కాలంలో ఖాళీ అయ్యే ప్రతి పదవీ తెలుదగుదేశం కూటమికే దక్కుతుంది. అలాగే తెలుగుదేశం పార్టీపై ఒత్తిడి పెంచి బీజేపీ కూడా తగుదునమ్మా అంటూ పదవుల కోసం పోటీ పడుతుందని అంటున్నారు. మొత్తం మీద కష్టమూ తెలుగుదేశందే, త్యాగాలూ ఆ పార్టీవే అన్నట్లుగా పరిస్థితి తయారైందన్న ఆవేదన పార్టీ శ్రేణులలో వ్యక్తమౌతోంది.

# విజయ శాంతికి ఎందుకంటే?

హైదరాబాద్,కాంగ్రెస్ పార్టీ చాలా కాలం తర్వాత ఓ చక్కని నిర్ణయం తీసుకుంది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో ఎంతో కాలంగా పార్టీ నాయకత్వం పట్ల సంపూర్ణ విశ్వాసంతో, విశ్వసనీయంగా పనిచేస్తున్న అద్దంకి దయాకర్ కి టికెట్ ఇచ్చింది. ఇంచుమించుగా రెండు దశాబ్దాలకు పైగా ప్రత్యక్ష, ఉద్యమ రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషిస్తున్న అద్దంకి దయాకర్ కు చట్టసభలో ప్రవేశించే అర్హతలన్నీ ఉన్నాయి. అయినా, చట్టసభలో కాలు పెట్టాలన్న ఆయన కోరిక ఇంతవరకూ నెరవేర లేదు. కారణాలు ఏవైనా అనేక సార్లు అవకాశాలు,తలుపు తట్టి మాయమై పోయాయి. చిక్కినట్లే చిక్కి చేజారి పోయాయి. అయితే ఏదయితే ఏం కానీ, చిట్ట చివరకు, అద్దంకి దయాకర్ చిరకాల స్వప్నం సాకార మయ్యే సదవకాశం లభించింది.దయాకర్ తో పాటుగా కాంగ్రెస్ పార్టీలో కింది స్థాయి నుంచి ఎదిగి వచ్చిన నల్గొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ నాయక్ కు పార్టీ టికెట్ దక్కింది. ఆ ఇద్దరి విషయంలో ఎవరికీ ఎలాంటి అభ్యంతరం లేదు. అలాగే, సిపిఐకి ఒక సీటు ఇవ్వడం కొంచెం ఎక్కువ అనిపించినా, సరే అని సరి పెట్టుకోవచ్చును. ఈసారి కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపిక, నల్గొండ సెంట్రిక్గా సాగిన నేపథ్యంలో సిపిఐకి 'ఉచిత' గ్యారెంటీల కోటాలో ఒక టికెట్ ఇవ్వడాన్ని కొంతలో కొంత అర్థం చేసుకోవచ్చును. కానీ కాంగ్రెస్ పార్టీలో అని కాదు అసలు రాజకీయాల్లో ఉన్నారో లేదో తెలియని రాములమ్మ విజయశాంతికి కాంగ్రెస్ అధిష్టానం ఏమి ఆశించి టికెట్ ఇచ్చిందో ఏ లెక్కన ఆమెను పెద్దల సభకు పంపాలని నిర్ణయించిందో మనకే కాదు.. కాంగ్రెస్ నాయకులు, క్యాడర్ కు కూడా అర్థం కావడం లేదు. కాంగ్రెస్ 'ముఖ్య' నాయకులకు అయితే అసలు మింగుడు పడడం లేదని అంటున్నారు. అందుకే విజయ శాంతి విషయంలో పార్టీలో అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా బీసీ నాయకులు కొందరు తమ అసంతృప్తిని బహిరంగంగానే వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాలుగా పార్టీలో కొనసాగుతున్న వీహెచ్, మధుయాష్కి గౌడ్ వంటి ఐడిలాజికల్ కమిటెమెంట్ ఉన్న సీనియర్ నాయకులను కాదని, స్థిరత్వం లేని, గాలివాటం రాజకీయాలకు అలవాటు పడిన విజయశాంతికి ఏ లెక్క టికెట్ ఇచ్చారనే ప్రశ్న పార్టీ వర్గాల్లో గట్టిగానే వినిపిస్తోంది. అంతే కాకుండా, ఓ వంక కోవర్టుల కారణంగా కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా నష్ట పోతోందని అంటూ, మరో వంక నిన్నమొన్నటి వరకు బీజేపీలో ఉన్న విజయ శాంతికి టికెట్ ఇవ్వడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. నిజమే, ఒకప్పుడు విజయశాంతికి, అటు సినిమా రంగంలో లేడీ అమితాబ్ గా ఇటు రాజకీయాల్లో ఫైర్ బ్రాండ్ లీడర్ గా మంచి పేరున్న మాట నిజం. అయితే అదంతా ఇప్పుడు గతం.ఇప్పుడు ఆమె సినిమాల్లో గెస్ట్ ఆర్టిస్ట్ కు ఎక్కువ, కన్నాంబ క్యారెక్టర్ కు తక్కువ అన్నట్లు ఉన్నారు. అప్పుడెప్పుడో, మహేష్ బాబు సినిమాలో కాసింత గుర్తింపున్న రోల్ లో నటించారు. అంతే, ఆ తర్వాత ఆమె వెండి తెర మీదనే కాదు. బుల్లి తెర



మీద కూడా కనిపించలేదు. రాజకీయాల్లోనూ అంతే అసెంబ్లీ ఎన్నికలకు ముందు, కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆమెకు పార్టీ స్టార్ క్యాంపైనర్ ట్యాగ్ తగిలించింది. అయినా ఆమె పెద్దగా ప్రచారం చేసిందీ లేదు. ఒరగ పెట్టింది అంత కంటే లేదు. లోక్ సభ ఎన్నికల్లోనూ ఆమె కంట్రిబ్యూషన్ ఇంచుమించుగా జీరో.ఇక ప్రస్తుతానికి వస్తే, ఆమె అసలు కాంగ్రెస్ పార్టీలో ఉన్నారా? లేరా? అనేది కూడా ఎవరికీ తెలియదు. ఈ మధ్య కాలంలో ఆమె పార్టీ కార్యక్రమాల్లో ఎక్కడా కనిపించిన దాఖలాలు లేవు. గాంధీ భవన్ గడప అయినా తొక్కారో లేదో తెలియదు. అంతే కాదు ఎమ్మెల్సీ టికెట్ కోసం అయినా ఆమె రాష్ట్ర నాయకులు ఎవరినీ కలవ లేదు. రాష్ట్ర పార్టీని, రాష్ట్ర నాయకులను ఇగ్నోర్ చేస్తూ నేరుగా ఢిల్లీ వెళ్లి అధిష్టానం కోటాలో టికెట్ తెచ్చుకున్నారు. నిజమో కాదో గానీ, ఆమెకు టికెట్ ఇస్తున్న విషయం రాష్ట్ర 'ముఖ్య' నాయకులకు కూడా చివరి నిముషం వరకూ తెలియదంటున్నారు. అందుకే కాంగ్రెస్ అధిష్టానం, ఏ అర్హతలు చూసి ఆమెకు టికెట్ ఇచ్చింది అనేది, ఇప్పుడు కాంగ్రెస్ నాయకులకు సైతం అర్థం కాని, ప్రశ్నగా మిగిలింది.అయితే., బీఆర్ఎస్, బీజేపీలను సమర్థంగా ఎదుర్కొనేందుకు, అధిష్టానం విజయ శాంతికి ఎమ్మెల్సీ టికట్ ఇచ్చిందనే ప్రచారం సాగుతోంది. కానీ ఆమెకు అంత సీన్ లేదని, పాతికేళ్ళకు పైగా రాజకీయాల్లో ఉన్నా, బీజేపీతో మొదలు పెట్టి, సొంత పార్టీ పెట్టి, బీఆర్ఎస్ లో కలిసి, కాంగ్రెస్' లో చేరి, మళ్ళీ బీజేపీలోకి వెళ్ళి మళ్ళీ కాంగ్రెస్ గూటికి చేరిన ఆమెకు రాజకీయ నిబద్దత మాత్రమే కాదు, అవగాహన కూడా లేదంటున్నారు. రాజకీయ భాషపై పట్టు అబ్బనే లేదని, ఎవరో స్క్రిప్ట్ రైటర్ రాసింది, బట్టీపట్టి సినిమాటిక్ గా చెప్పడమే కానీ , అందరికీ అర్థమయ్యేలా, అందరినీ ఒప్పించేలా మాట్లాడలేరని అంటున్నారు. అందుకే కాంగ్రెస్ అధిష్టానం ఏమి చూసి విజయశాంతికి టికెట్ ఇచ్చారు అన్నది .. పజిలింగ్ గానే మిగిలింది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com